పెద్దారవీడు తహసీల్దార్ కార్యాలయం వేదికగా భూమాయ చోటుచేసుకుంది. మండలంలోని తోకపల్లిలో రైతులకు చెందిన 9.87 ఎకరాల భూమిని తహసీల్దార్ ఓ వ్యక్తి పేరుతో ఆన్‌లైన్ చేశారు. రాత్రికిరాత్రే అప్పటి వరకూ భూములకు యజమానులుగా ఉన్న పది మంది పేర్ల స్థానంలో వారితో సంబంధంలేని మరో వ్యక్తి పేరును చేర్చారు. విషయం తెలుసుకొని నిర్ఘాంతపోయిన బాధిత రైతులు శనివారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని నిరసన తెలిపారు. గతంలోనూ ఈ భూములపై వివాదం నడిచింది. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. ఈ సమయంలో తహసీల్దార్ అడ్డగోలుగా ఆన్‌లైన్ చేయడం ఆయన బరితెగింపును తెలియజేస్తోంది. మరికొద్ది నెలల్లోనే సదరు తహసీల్దార్ ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో అందినకాడికి దండుకోవాలన్న ఉద్దేశంతో ఇలాంటి వ్యవహారాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కాపురం డివిజన్‌లో గత వైసీపీ హయాంలో పనిచేసిన కొందరు తహసీల్దార్‌లు, రెవెన్యూ సిబ్బంది ఉద్యోగ విరమణ ముందు భూ మాయలు చేసి అరెస్టు కావడం, విచారణలు ఎదుర్కోవడం వంటి ఉదంతాలు ఉన్నాయి. అయినప్పటికీ ఇలాంటి వ్యవహారాలు ఇంకా కొనసాగుతుండటం రెవెన్యూలో అక్రమాలు వ్యవస్థీకృతమన్న విషయాన్ని మరోసారి రుజువు చేస్తున్నాయి.

అడ్డగోలుగా ఆన్‌లైన్


పెద్దారవీడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న తోకపల్లి బాధితులు

తోకపల్లి బాధితుల నిరసన

తమ భూమలను వేరొకరి పేరుపై మార్చడాన్ని గుర్తించిన తోకపల్లి భూబాధితులు శనివారం పెద్దారవీడు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. తమకు జరిగిన అన్యాయంపై ఫోన్ల ద్వారా జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతోపాటు స్థానిక తహసీల్దార్‌ను నిలదీశారు. స్పందించిన తహసీల్దార్ దిలీప్‌కుమార్ ప్రస్తుతం డిజిటల్ సంతకం తొలగించే అవకాశం తనకు లేదని, జాయింట్ కలెక్టర్ పరిధిలో ఉందని తెలిపారు. అదేవిధంగా ఆ భూములకు సంబంధించి ఎటువంటి క్రయవిక్రయాలకు అనుమతులు ఇవ్వద్దంటూ మార్కాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆయన లేఖ రాశారు.

రైతుల భూములను ఇంకొకరి పేరుపై మార్చిన తహసీల్దార్

- మరికొద్ది రోజుల్లో ఉద్యోగ విరమణ చేయనున్న సదరు అధికారి
- రాత్రికిరాత్రే పెద్దారవీడు కార్యాలయంలో మాయ
- ఆ 9.87 ఎకరాలు వివాదాస్పద భూములు
- అయినా బరితెగింపు.. తోకపల్లి బాధితుల నిరసన

పెద్దారవీడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం డివిజన్‌లో ఇప్పటి వరకూ ప్రభుత్వ భూములు మాత్రమే ఆక్రమణకు గురయ్యాయి. ఇప్పుడు పెద్దారవీడులో ఏకంగా రైతుల భూములనే మార్చేశారు. ఈ అక్రమానికి తహసీల్దార్ కార్యాలయం కేంద్ర బిందువుగా మారింది. ఇవి కలెక్టర్ స్థాయి అధికారి విచారణ పరిధిలో ఉన్న భూములు కావడం సదరు అక్రమార్కుల బరితెగింపును తెలియజేస్తోంది.

రాత్రికి రాత్రే 9.87 ఎకరాలు మార్పిడి

పెద్దారవీడు మండలం తోకపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో దాదాపు పది మంది రైతుల పేర్లతో ఉన్న 9.87 ఎకరాల భూమిని శుక్రవారం రాత్రి తహసీల్దార్ దిలీప్‌కుమార్ అదే గ్రామానికి చెందిన వ్యక్తి పేరుతో మారుస్తూ డిజిటల్ సంతకం చేశారు. నిబంధనల ప్రకారం ఆ భూ ములకు కిందిస్థాయి సిబ్బంది రికార్డు తయారు చేయాల్సి ఉంది. కానీ ఎలాంటి ప్రొసీడింగ్స్ లేకుండానే సదరు తహసీల్దార్ పనికానిచ్చేశారు. తోకపల్లి గ్రామానికి చెందిన బిట్ర వెంకట లక్ష్మమ్మ, తిరుమలమ్మ పేర్లతో సర్వే నంబరు 102/1బీలో 3.58 ఎకరాలు, మేకల పోతురాజు పేరుతో సర్వే నంబరు 214లో 0.28 సెంట్లు, ఉప్పలపాటి ఆదాం, కోటయ్య, అచ్చయ్య పేర్లతో సర్వే నంబరు 263/3లో 4.76 ఎకరాలు, కనకం కోటేశ్వరమ్మ పేరుతో సర్వే నెంబరు 349లోని 0.96 సెంట్ల భూమి, రమ్య, కీర్తి పేరుతో సర్వే నంబరు 23లో 0.18 సెంట్ల భూమి, సరాల వెంకట్రావు పేరుతో సర్వే నంబరు 215లోని 0.11 సెంట్ల భూములు రాత్రికి రాత్రే పేర్లు మారిపోయాయి. అదేగ్రామానికి చెందిన మేకల శంకరరావుకు ఆ భూములపై హక్కు ఉన్నట్లు తహసీల్దార్ దిలీప్‌కుమార్ నిర్ధారిస్తూ డిజిటల్ సంతకం చేశారు.

విచారణలో ఉన్న భూములు

తహసీల్దార్ దిలీప్‌కుమార్ శుక్రవారం సంతకాలు చేసిన భూములతోపాటు మరి కొన్నింటిపై విచారణ జరుగుతోంది. పెద్దారవీడు తహసీల్దార్‌గా ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన పులి శైలేంద్రకుమార్ గత ఏప్రిల్‌లో ఆ భూములను మేకల శంకరరావు పేరుపై ఆన్‌లైన్ చేశారు. బాధితులు అప్పటి కలెక్టర్‌కు ఒంగోలు వెళ్లి ఫిర్యాదు చేయడంతో భూ యజమాని మార్పిడి ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అప్పటి కలెక్టర్ తోకపల్లిలోని ఆయా భూములను వివాదాస్పద జాబితాలో చేర్చాలని, వాటిపై విచారణ చేపట్టాలని నివేదిక ఇవ్వాలని వెలిగొండ ప్రాజెక్ట్ కంభం ఎస్‌డీసీని ఆదేశించారు. ప్రస్తుతం ఆ భూము ల పరిస్థితి విచారణ దశలో ఉంది. కానీ శైలేంద్రకుమార్ ఉద్యోగ విరమణ అనంతరం పెద్దారవీడుకు తహసీల్దార్‌గా వచ్చిన దిలీప్‌కుమార్‌కు గతంలోనూ ఇక్కడ పనిచేసిన అనుభవం ఉంది. విచారణలో ఉన్న భూములపై శుక్రవారం రాత్రి ఆయన డిజిటల్ సంతకం చేశారు.

గతంలో జోరుగా ఇలాంటి వ్యవహారాలు

మార్కాపురం డివిజన్ అంటే భూఅక్రమాలకు కేంద్రబిందువుగా మారింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నేతల భూ అక్రమాలకు తోడ్పాటునందించి మార్కాపురంలో తహసీల్దార్ స్థాయి అధికారి ఉద్యోగ విరమణ అనంతరం అరెస్టయ్యారు. అందుకు సహకరించిన 14మంది వీఆర్వోలు, ఎంఆర్‌ఐ కూడా సస్పెండయ్యారు. తర్లుపాడు మండలంలో సైతం నేతల భూ అక్రమాలకు కొమ్ముకాసిన తహసీల్దార్ సెలవుపై విదేశాలకు వెళ్లినప్పటికీ జిల్లా ఉన్నతాధికారులు తమదైన శైలిలో స్పందించి పిలిపించారు. ఇటువంటి ఉదంతాలు మార్కాపురం డివిజన్‌లోని ప్రతి మండలంలో సర్వసాధారణమయ్యాయి. కానీ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతుంది ఉద్యోగ విరమణ చేయబోయే ఉన్నతాధికారులు కావడం చర్చనీయాంశమైంది. పెద్దారవీడు తహసీల్దార్ సైతం మరికొద్ది నెలల్లో ఉద్యోగ విరమణ చేయనుండటం గమనార్హం.

143 బాణసంచా షాపులకు అనుమతి

సరైన పత్రాలు లేకపోవడంతో 73 దరఖాస్తులు తిరస్కరణ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగను పురస్కరించుకొని జిల్లాలో బాణసంచాను విక్రయించుకునేందుకు 143 షాపులకు అధికారులు అనుమతి ఇచ్చారు. మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో షాపుల నిర్వహణకు 216 దరఖాస్తులు రాగా అందులో 73 తిరస్కరించారు. ఒంగోలు డివిజన్‌లో 98 దరఖాస్తులు రాగా 80 షాపులకు అనుమతి ఇచ్చారు. కనిగిరి డివిజన్‌లో 57 దరఖాస్తులకు కేవలం ఐదింటికి మాత్రమే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. మార్కాపురం డివిజన్‌లో 61 దరఖాస్తులు రాగా 58 షాపులకు అనుమతి ఇచ్చారు.


ఒంగోలులోని పీవీఆర్ గ్రౌండ్స్‌లో దుకాణదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

స్పెషల్ కలెక్టర్‌గా జేసీకి అదనపు బాధ్యతలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెలిగొండ స్పెషల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీధర్‌రెడ్డిని రెండు రోజుల క్రితం ప్రభుత్వం బదిలీ చేసింది. దీంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది.


ర్యాలీలో సైకిల్‌పై మంత్రి స్వామి

సైకిల్ తొక్కిన మంత్రి.. నడిచి వచ్చిన కలెక్టర్

ఉత్సాహంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

- క్లీన్ ఎయిర్‌పై పెద్దఎత్తున అవగాహన
- జిల్లావ్యాప్తంగా ర్యాలీలు
- మొక్కలు నాటిన నేతలు, అధికారులు
- స్వచ్ఛగాలి కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాలని పలువురు పిలుపు

ఒంగోలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం శనివారం ఉత్సాహంగా సాగింది. ప్రతినెలా మూడో శనివారం ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని ఒక్కోసారి ఒక్కో అంశంపై నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ వారం క్లీన్ ఎయిర్ (పరిశుభ్రమైన గాలి) ఇతివృత్తంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించింది. తదనుగుణంగా జిల్లావ్యాప్తంగా స్థానిక సంస్థల ఆధ్వర్యంలో ఊరూరా అవగాహన ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించారు. పెద్దఎత్తున మొక్కలు నాటారు. జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి కొండపి నియోజకవర్గ పరిధిలోని సింగరాయకొండలో వందలాది మందితో నిర్వహించిన ర్యాలీలో పాల్గొనడమే కాక సైకిల్ తొక్కుతూ కాలుష్య నియంత్రణపై సందేశం ఇచ్చారు. ఒంగోలులో కలెక్టర్ రాజాబాబు కాలుష్య రహితంపై అవగాహన కోసం తన బంగ్లా నుంచి కలెక్టరేట్‌కు ఇతర అధికారులతో కలిసి నడుచుకుంటూ వచ్చారు. పాకల సముద్ర తీరంలో మంత్రి డాక్టర్ స్వామి, కలెక్టర్ రాజాబాబు మొక్కలు నాటారు. సంతనూతలపాడు హైస్కూల్‌లో అక్కడి ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్, మార్కాపురం తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ మొక్కలు నాటారు. జిల్లాలోని ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాలే కాక గ్రామ, గ్రామానా ర్యాలీలు, సభలు, సమావేశాలు జరిగాయి. ఉత్సాహంగా వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు. ప్రభుత్వం పర్యావరణానికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునివ్వడంతో జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు కార్యాలయానికి సైకిల్‌పై వచ్చారు. ఆయన నివాసం నుంచి సైకిల్ తొక్కుకుంటూ కార్యాలయానికి చేరుకున్నారు. శనివారం కలెక్టరేట్‌లోకి వాహనాల అనుమతిని నిరాకరించారు. రెండు ప్రధాన గేట్లు మూసివేసి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, వివిధ పనుల కోసం వచ్చిన ప్రజల వాహనాలను బయటే నిలిపివేశారు. కేవలం ఎలక్ట్రికల్ వాహనాలను మాత్రమే అనుమతించారు.


ప్రకాశం భవన్‌కు నడిచి వస్తున్న కలెక్టర్ రాజాబాబు, పక్కన డీఆర్వో ఓబులేసు

పొగాకు కొనుగోళ్లకు 23వరకు సెలవు

ఒంగోలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది పొగాకు వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు వరుసగా నాలుగు రోజులు నిలిచిపోనున్నాయి. దీపావళి పండుగ నేపథ్యంలో ఈనెల 23 వరకు బోర్డు అధికారులు సెలవులు ప్రకటించారు. 19వతేదీ ఆదివారం కాగా, సోమవారం దీపావళి పండుగ సెలవును ప్రభుత్వం ప్రకటించింది. 21,22 తేదీలు కూడా వేలం కేంద్రాల నిలిపివేతకు అధికారులు ఆదేశాలు ఇచ్చారు. దక్షిణాది పొగాకు మార్కెట్‌లో కొనుగోళ్లు ప్రారంభించి ఏడు మాసాలు పూర్తయ్యింది. పలు కంపెనీల బయ్యర్లు, సిబ్బంది సెలవులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ లోపే కర్ణాటకలో వేలం ప్రారంభం కావడంతో వారిపై మరింత ఒత్తిడి పెరిగింది. దీంతో నాలుగు రోజులు వేలం కేంద్రాలకు సెలవులు ఇవ్వాలని పొగాకు కంపెనీల ప్రతినిధులు కోరినట్లు సమాచారం. అందుకు బోర్డు అధికారులు అంగీకరించడంతో 19నుంచి 22 వరకు వరుసగా నాలుగు రోజులు వేలం కేంద్రాలలో కొనుగోళ్లు ఆగిపోనున్నాయి. తిరిగి వేలం ప్రక్రియ 23వ తేదీ ప్రారంభం కానుంది. బోర్డు ఆర్‌ఎం, అలాగే వేలం కేంద్రాల కార్యాలయాలు మాత్రం పనిచేస్తాయి.

శివకాశి టూ ఒంగోలు

- బాణసంచా అక్రమాలపై కొరవడిన నిఘా
- అంతా జీరో వ్యాపారమే
- అధికారుల తనిఖీలు నామమాత్రం
- రూ. 20 కోట్లకుపైగా విక్రయాలు

9

24న డీఆర్సీ సమావేశం

ఒంగోలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమీక్షా మండలి సమావేశం (డీఆర్సీ) ఈనెల 24న జరగనుంది. ఆరోజు ఉదయం 10.30 గంటలకు ఒంగోలు ప్రకాశం భవన్‌లోని సమావేశపు హాలులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం ప్రారంభమవుతుంది. జిల్లాస్థాయిలో అత్యంత కీలకమైన డీఆర్సీని ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక గత ఏడాది అక్టోబరులో ఆనం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియామకం జరగ్గా తొలి సమావేశం ఆ ఏడాది నవంబరు 4న జరిగింది. రెండో సమావేశాన్ని ఈ ఏడాది మే 23న ఏర్పాటుకు నిర్ణయించగా ముందు రోజు రాత్రి ఒంగోలులో టీడీపీ నేత వీరయ్య హత్యకు గురయ్యారు. ఆయన అంత్యక్రియలకు 23న సీఎం చంద్రబాబు హాజరు నేపథ్యంలో వాయిదా పడింది. అనంతరం జూన్ 12న సమావేశాన్ని నిర్వహించారు. కొత్త కలెక్టర్ల నియామకాలు గత నెలలో జరగ్గా అనంతరం అన్ని జిల్లాల్లోనూ డీఆర్సీ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 24న ఇక్కడ ఏర్పాటుకు నిర్ణయించారు.

ధన త్రయోదశికి ధరాఘాతం

- భారీగా కొనుగోలు చేసే రోజే వ్యాపారాలు నిల్
- సామాన్యులకు అందుబాటులో లేని బంగారం
- అమాంతం పెరుగుతుండటంతో తగ్గిన కొనుగోళ్లు

9

పొదుపు సొమ్ము స్వాహా

సభ్యులు రుణానికి చెల్లించిన రూ.8.50 లక్షలు సొంతానికి వాడుకున్న గ్రూపు లీడర్

తాళ్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సొమ్మును గ్రూపు లీడర్ స్వాహా చేశారు. బ్యాంకులో తీసుకున్న రుణానికి సంబంధించి నెలవారీ సభ్యులు చెల్లించిన రూ.8.50లక్షలను సొంతానికి వాడేసుకున్నారు. లింగాలపాడులో చోటుచేసుకున్న ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధిత మహిళలు శనివారం కార్యాలయానికి చేరుకుని తమగోడు వెళ్లబోసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. లింగాలపాడులోని గణేష్ గ్రూపు సభ్యులు తూర్పుగంగవరం యూనియన్ బ్యాంక్‌లో 2023 ఫిబ్రవరిలో రూ.20 లక్షల రుణం తీసుకున్నారు. ప్రతినెలా ఒక్కో సభ్యురాలు చెల్లించాల్సిన సొమ్మును గ్రూపు లీడర్ అయిన, కొత్తపాలెంలో ఆశాకార్యకర్తగా పనిచేస్తున్న గోగుల ఏడుకొండలుకు అందజేశారు. 14 నెలల పాటు ఒక్కొక్కరు రూ.ఆరువేల వంతున పది మంది మహిళా సభ్యులు చెల్లించారు. మొత్తం 8.50లక్షల రూపాయల్లో ఒక్క పైసా కూడా బ్యాంక్‌కు చెల్లించకుండా గ్రూపు లీడర్ సొంతానికి వాడుకున్నారు. గ్రూపు మహిళలు బాకీ చెల్లించకపోవడంతో గతనెలలో బ్యాంక్ మేనేజర్ గణేష్ వారి వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్‌లకు మెమో పెట్టారు. దీంతో విషయం వెలుగు చూసింది. ఆగ్రూపు మహిళలు ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డిలు గ్రూపు లీడర్ ఏడుకొండలును పిలిపించి బాధిత మహిళల సమక్షంలో నిలదీయగా తప్పు చేశానని అంగీకరించారు. ఆ డబ్బులు వారికి చెల్లిస్తానని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధిత పొదుపు మహిళలు కోరుతున్నారు.

ఒక్కరోజు.. 5 వేల మొక్కలు

భారీ కార్యక్రమానికి ఎమ్మెల్యే జనార్దన్ కార్యాచరణ

- ఈనెల 24న ముహూర్తం
- ప్రధాన రోడ్ల పక్కన ప్రాధాన్యం
- ప్రభుత్వ స్థలాల్లోనూ నాటే కార్యక్రమం
- విద్యార్థుల భాగస్వామ్యం
- పాల్గొననున్న మంత్రులు ఆనం, స్వామి, ఎమ్మెల్యేలు

ఒంగోలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర సుందరీకరణపై ప్రత్యేక దృష్టి సారించి పనిచేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. నగరంలో ఒక్క రోజునే ఏకంగా ఐదువేల మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించారు. అందుకు ఈనెల 24న ముహూర్తంగా నిర్ణయించారు. మునిసిపల్ కార్పొరేషన్ పర్యవేక్షణలో వేలాది మంది ఇంజనీరింగ్, ఇతర విద్యార్థులతో ఈ మొక్కలన్నింటినీ నాటించనున్నారు. అందుకు సంబంధించి ఇప్పటికే ఏ ప్రాంతంలో ఎలా అన్న ప్రణాళిక కూడా రూపొందించారు. నగరంలో అభివృద్ధి పనులు చేపట్టడంలో గతంలోనే మంచిపేరు తెచ్చుకున్న ఎమ్మెల్యే జనార్దన్ ఈసారి అధికారంలోకి వచ్చాక జిల్లాకేంద్రమైన నగర సుందరీకరణకు ప్రాధాన్యం ఇచ్చారు. ఏడాది కాలంగా నగరంలో కీలక రోడ్ల విస్తరణ, ప్రధాన మురుగు కాలువలతోపాటు వివిధ ప్రాంతాల్లో రోడ్లు, కాలువల పరిశుభ్రతపై దృష్టిపెట్టారు. కొన్ని ప్రధాన రోడ్లలో డివైడర్లపై మొక్కల పెంపకం, బొమ్మల ఏర్పాటు, పార్కుల్లో ఆహ్లాదకర వాతావరణం వంటి పనులు చేపట్టారు. వాటిని కొనసాగిస్తూనే తాజాగా నగరంలో పచ్చదనం పెంపు అవసరాన్ని గుర్తించి తదనుగుణ చర్యలు చేపట్టారు.

విద్యార్థుల భాగస్వామ్యం

ఒకే రోజున ఐదువేల మొక్కలు నాటే కార్యక్రమం కావడంతో నగరంలోని ఇంజనీరింగ్, ఇతర కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులను భాగస్వామ్యం చేస్తున్నారు. ఇప్పటికే కళాశాలల యాజమాన్యాలతో ఎమ్మెల్యే జనార్దన్ మాట్లాడి ఏప్రాంతంలో ఏ కాలేజీ విద్యార్థులు హాజరుకావాలన్న దానిపై కూడా స్పష్టత ఇచ్చారు. నగరంలోని కర్నూలు రోడ్డు, మంగమూరు రోడ్డు, పాత బైపాస్ రోడ్డు, ట్రంకు రోడ్డు, కొత్తపట్నం బస్టాండు రోడ్డు, గుంటూరు రోడ్డు, ఇలా ఎనిమిది ప్రధాన రోడ్లను గుర్తించి వాటికి ఇరువైపులా.. అలాగే డివైడర్లు ఉన్న చోట్ల మధ్యలో మొక్కలు నాటనున్నారు. ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లోనూ నాటేలా చర్యలు చేపడుతున్నారు.

పచ్చదనం కోసం ప్రణాళిక

నగరంలోని ప్రధాన నగరాలకు ఇరువైపులా, డివైడర్లు, ప్రభుత్వ స్థలాల్లోనూ విస్తారంగా మొక్కలు నాటాలని నిర్ణయించారు. కార్పొరేషన్ అధికారులతో ప్రణాళిక తయారు చేయించారు. అందులో భాగంగా ఈనెల 24న ఒకే రోజు ఐదువేల మొక్కలను నాటేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వివిధ రకాల మొక్కలను కడియం, ఇతర ప్రాంతాల నర్సరీల నుంచి తెప్పించి కార్పొరేషన్ కార్యాలయంలో సిద్ధంగా ఉంచారు. ఆరోజున జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి, ఒంగోలు ఎంపీ మాగుంటతోపాటు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు కూడా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారని సమాచారం.


ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయంలో సిద్ధంగా ఉన్న ఒక రకం మొక్కలు

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో..
అందరూ భాగస్వాములు కావాలి

మంత్రి డాక్టర్ స్వామి

ఉద్యమంలా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలు

సంతనూతలపాడులో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎన్

సింగరాయకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సాధనే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, అందులో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు. శనివారం సింగరాయకొండలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. తొలుత పాకల రోడ్డు నుంచి కందుకూరు రోడ్డు వరకు నిర్వహించి సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. కందుకూరు రోడ్డు డివైడర్ మధ్యలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో 2015లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. వైసీపీ అధికారంలో వచ్చిన తరువాత ఆ కార్యక్రమాన్ని సైతం నిలిపివేసిందని, చెత్తసంపద కేంద్రాలను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ప్రస్తుత ప్రజాప్రభుత్వం మళ్లీ స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తూ చెత్తనుంచి సంపద తయారీకి చర్యలు తీసుకొంటున్నదన్నారు. స్వచ్ఛ సింగరాయకొండ సాధించడానికి అందరూ సహకరించాలని కోరారు. స్థానిక ట్రంకురోడ్డు నిర్మాణానికి రూ.3కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. రైతు బజారు ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలోనే అన్న క్యాంటీన్ కూడా ప్రారంభించనున్నట్లు వివరించారు. అనంతరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, డీపీవో వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎస్‌బీవీ రాజేష్, ఎంపీడీవో జయమణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్



పారిశుధ్య కార్మికులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి స్వామి

పర్యావరణాన్ని కాపాడటం అందరి బాధ్యత : బీఎన్

సంతనూతలపాడు: పర్యావరణాన్ని కాపాడటం ప్రతీ ఒక్కరి బాధ్యతని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సంతనూతలపాడులోని జడ్పీహైస్కూలులో ఆయన మొక్కలను నాటారు. అనంతరం హెచ్ఎం ప్రమోద స్కూల్ ప్రహరీ, గేట్ల నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, త్వరలో తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంతనూతలపాడు, ఎండ్లూరు డొంకపరిధిలోని కర్నూల్‌రోడ్డుపై కల్వర్టర్లు ప్రమాదకరంగా మారాయని ఎమ్మెల్యే దృష్టికి పలువురు నాయకులు తీసుకెళ్లగా వాటి నిర్మాణం కోసం అంచనాలు వేసినట్లు త్వరలో పనులు ప్రారంభం మవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.సురేష్‌బాబు, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఏపీఎం బాబూరావు, ఎంఈవో వెంకారెడ్డి, టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, ప్రధానకార్యదర్శి రావులపల్లి వెంకటసురేష్‌బాబు, ఎంపీపీ బి.విజయ, బి.శంకర్, బి.చంద్రశేఖర్, ఎం.శ్రీనివాసరావు, టీ.శ్రీనివాసరావు, ఎం.రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులతో అవగాహన ర్యాలీలు

కొండపి/టంగుటూరు/జరుగుమల్లి: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలు శనివారం గ్రామగ్రామానా ఉద్యమంలా కొనసాగాయి. కొండపి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో డీటీ రవికుమార్, ఆర్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ టంగుటూరులోని తహసీల్దార్ కార్యాలయం నుంచి విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ ఆంజనేయులు సిబ్బందితో కలిసి సైకిల్ తొక్కుతూ ఉత్సాహపరిచారు.



సైకిల్ తొక్కుతున్న తహసీల్దార్ ఆంజనేయులు

జరుగుమల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పారిశుధ్య నిర్వహించారు. ఆవరణలో మొక్కలు నాటారు. సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ పి.మురళి పాల్గొన్నారు. కె.బిట్రగుంట కేజీబీవీలో విద్యార్థులు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో రమణమూర్తి, ఏవో కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నలూరులో సైకిల్ ర్యాలీ

పొన్నలూరు: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కర్ల తిరుపతమ్మ, తహసీల్దార్ వి.పుల్లారావు, వ్యవసాయ అధికారి వడ్డే రాము, టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, టీడీపీ సీనియర్ నాయకులు మండవ మురళీమోహన్, పల్లపోతు ప్రసాద్, రమేష్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

పచ్చదనంతోనే మానవ మనుగడ

నాగులుప్పలపాడు: పచ్చదనం పెంపొందించడం ద్వారా మానవ మనుగడకు భద్రత లభిస్తుందని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పలు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగులుప్పలపాడులో ఎంపీడీవో మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల్లో పదివేల మొక్కలను ఇంటింటికి అందించి నాటించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మురళీ, ఏపీవో దేవరపల్లి రవిబాబు పాల్గొన్నారు.



విద్యార్థులకు మొక్కలను అందిస్తున్న ఎంపీడీవో రవికుమార్

కలెక్టర్‌ను కలిసిన నరసం నేతలు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ రాజాబాబును నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) ప్రతినిధులు శనివారం కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజాబాబును నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తమ్మిశెట్టి రమాదేవి మర్యాదపూర్వకంగా కలిసి మహిళల సంరక్షణ అనే పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వడ్డెరల సంక్షేమానికి సంబంధించిన, శక్తిసదన్(నిరాశ్రయుల) సంరక్షణ అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. కార్యక్రమంలో కోశాధికారి బీరం అరుణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ రాజాబాబుకు పుస్తకాన్ని అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

కలెక్టర్‌కు వైపాలెం ఎమ్మెల్యే సత్కారం

కలెక్టర్ రాజాబాబును యర్రగొండపాలెం శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువతో సత్కరించి బొకే అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వైపాలెం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలను కలెక్టర్‌తో చర్చించారు.

ఎమ్మెల్యేలకు సొసైటీ అధ్యక్షుడి కృతజ్ఞతలు

ఒంగోలు(రూరల్), అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): లింగంగుంట సొసైటీ పాలకవర్గ సభ్యులు శనివారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి బొకేలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు నల్లమోతు బాలగంగాధర్ మాట్లాడుతూ తనకు పదవి రావటానికి కృషి చేసిన ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్‌లకు ధన్యవాదాలు చెప్పినట్లు పేర్కొన్నారు. రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుండపనేని శ్రీనివాసులు, పిల్లుట్ల సుధాకర్, మక్కెన శ్రీనివాసరావు, పాతూరి పూర్ణచంద్రరావు, ఎన్.చలపతి, వెంకట్రావు, కె.శ్రీకాంత్, చుండి శ్యామ్, రాచగర్ల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు వీల్‌చైర్స్, బెడ్‌షీట్లు వితరణ

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రీతమవర్షిత హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా ప్రభుత్వ వైద్యశాల(జీజీహెచ్)కు వీల్‌చైర్స్, బెడ్‌షీట్లు వితరణ చేశారు. వంకయలపాటి సాంబశివరావు, కవిత దంపతుల కుమార్తె వర్షిత పుట్టినరోజు సందర్భంగా జీజీహెచ్ సూపరిటెండెంట్ డాక్టర్ ఎం.మాణిక్యరావుకు అందజేశారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వైద్యులు ఎం.మాణిక్యరావు, నామినేని కిరణ్‌కుమార్, మాధవిలతలు మాట్లాడుతూ వర్షిత కుటుంబసభ్యుల సేవా దృక్పథాన్ని కొనియాడారు. వర్షిత అత్త, మామ కొమ్మి రమణయ్య, రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మారెళ్ళ సుబ్బారావు, రాజేశ్వరి, డాక్టర్ ఏడుకొండలు, బి.ప్రసాద్, చిక్కాల కిరణ్‌కుమార్, భారతి పాల్గొన్నారు.



వీల్‌చైర్లు, బెడ్‌షీట్లు వితరణ చేస్తున్న దాతలు

పేస్ కళాశాలలో అవగాహన సదస్సు

ఒంగోలు విద్య, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్‌పై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ జి.బాలాజీ, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.శ్రీవేణి హాజరై మాట్లాడారు. వ్యాధి లక్షణాలు, వ్యాప్తి మార్గాలు, నివారణ చర్యలు, టీబీ రోగులతో మెలిగే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్‌లు సీవీ.సుబ్బారావు, ఆర్.వీరాంజనేయులు, రూప అక్కేష్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.మల్లికార్జునరావు, బి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ శ్రీవేణిని సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రశ్నించేతత్వంతో సమస్యల పరిష్కారం



ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు, ఉపాధ్యాయులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్ని సమస్యలకు ప్రశ్నించే తత్వం, శాస్త్రీయ దృక్పథంతోనే పరిష్కారం లభిస్తుందని జేవీవీ సీనియర్ నాయకుడు ఏవీ.పుల్లారావు అన్నారు. ఒంగోలులోని కృష్ణ మెమోరియల్ స్కూలులో శనివారం చెకుముకి సైన్స్ పరీక్ష, అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించినప్పుడే సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.జయప్రకాష్ మాట్లాడుతూ జేవీవీ ఆధ్వర్యంలో గత 36 ఏళ్ళ నుంచి ప్రతి ఏటా సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం జిల్లావ్యాప్తంగా 400 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చెకుముకి సంబరాలు నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం చెకుముకి ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.వసుంధారాదేవి, ప్రిన్సిపాల్ ఐ.లక్ష్మీజాహ్నవి, ఉపాధ్యాయులు రోజ్‌ప్రియ, జాగృతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

స్పాసెంటర్‌పై పోలీసుల దాడి

ఒంగోలు క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఓ స్పా సెంటర్‌పై పోలీసులు శనివారం దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ యు.సుధాకర్ తెలిపారు. స్థానిక నెల్లూరు బస్టాండ్‌లో స్పాసెంటర్ నిర్వహిస్తున్న మహిళతో పాటు ఓ యువతి, యువకుడిని అదుపులోకి తీసుకొని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

ఎయిడెడ్ స్కూళ్లలో సదుపాయాలు కల్పించాలి

ఒంగోలు విద్య, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు మంచినీటి వసతితో పాటు ఆయాలను నియమించాలని ఏపీ టీచర్స్ గిల్డ్‌జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వెంకట్రావు, ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఎయిడెడ్ విద్యార్థులకు ప్రభుత్వ విద్యార్థులతో సమానంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు.

ఉప్పుగుండూరు పంచాయతీలో డీపీవో విచారణ

నాగులుప్పలపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామస్థుల ఫిర్యాదుల నేపథ్యంలో శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో డీపీవో ఎం.వెంకటేశ్వరరావు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ కాట్రగడ్డ చంద్రబాబు, టీడీపీ నాయకులు తెలగతోటి జాన్సన్, సీపీఎం నాయకుడు తూబాటి శ్రీకాంత్, ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు తదితరులు డీపీవోతో మాట్లాడారు. గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోలేదని, పాలకవర్గం సర్వసభ్య సమావేశాలు నిర్వహించడం లేదని, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని, ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదంటూ ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో డీపీవో పంచాయతీ రికార్డులను పరిశీలించి సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించారు. విధుల్లోనూ సమయపాలన పాటించకపోవడంపై కార్యదర్శి శ్రీనివాసరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడిన వారివద్ద నుంచి నిధులు రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం తాగునీటి కేంద్రాన్ని పరిశీలించారు. రెండు రోజులకోసారి ట్యాంకులను పరిశుభ్రపరచాలన్నారు. వాటర్‌ప్లాంట్‌కు అనుసంధానంగా ఉన్న బావిలోని నీరు పరిశీలించి ఆ నీటిని ల్యాబ్‌కు పంపించాలని కార్యదర్శికి సూచించారు. పారిశుధ్య పనుల్లో అధికారులు, సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, సర్పంచ్ జయమ్మ, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలపై చర్చ

ఒంగోలులో కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జూనియర్ న్యాయవాదులకు ప్రభుత్వం ఇచ్చే స్టయిఫండ్‌ను రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచాలని బార్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని బార్ అసోసియేషన్ హాలులో అధ్యక్షుడు బొడ్డు భాస్కరరావు ఆధ్వర్యంలో జిల్లా న్యాయవాదుల ఫెడరేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ న్యాయవాదులకు గతంలో ఇచ్చిన లైబ్రరీ ఏర్పాటు పథకాన్ని కొనసాగించాలని, బార్ కౌన్సిల్ ఇచ్చే డెత్ బెనిఫిట్స్‌తో పాటు ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్లు గతంలో ఇచ్చిన విధంగా కొనసాగించాలని కోరారు. బార్ కౌన్సిల్ ఇచ్చే రూ.9లక్షలను రూ.13లక్షలకు పెంచాలని తీర్మానించారు. సమావేశంలో గిద్దలూరు, దర్శి, సింగరాయకొండ, అద్దంకి బార్ అసోసియేషన్ అధ్యక్షులు శేషశాయనరెడ్డి, ప్రేమ్‌కుమార్, రమేష్, శ్రీనివాస్, సెక్రటరీలు జగ్జీవర్, మేరుగ రవి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ నాయకులు

రాష్ట్రస్థాయి పోటీలకు వెన్నూరు విద్యార్థులు



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

కొండపి, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెన్నూరు జడ్పీస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ఖైనంపాడులో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-14, 17 హాకీ సెలక్షన్స్‌లో స్కూల్‌కు చెందిన డి.నితిన్, యశ్వంత్, శ్యాం, శివాజీ, రిషి, అభి, సాత్విక్, వైష్ణవి, హస్మిత, శిరీష పాల్గొని ప్రతిభ చూపారు. వీరిని శనివారం స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం భారతి, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎన్.చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు. ఎంపికైన వారు త్వరలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

పేర్నమిట్ట చెరువులో గుర్తుతెలియని మృతదేహం

సంతనూతలపాడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పేర్నమిట్ట చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శనివారం వెలుగు చూసింది. సమాచారం అందుకున్న ఒంగోలు తాలూకా పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి పరిశీలించారు. అయితే ఎలాంటి ఆధారాలు దొరకలేదు. మృతదేహాన్ని ఎడమతొంటికింద, కుడిమోకాలు దిగువ భాగంలో గాయాలు తగిలి ఆపరేషన్ అయిన ఆనవాళ్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి వయస్సు సుమారుగా 50 ఏళ్లు ఉండవచ్చన్నారు. గుర్తించిన వాళ్లు సెల్‌నెంబర్లు 9121102127, 9121102129లను సంప్రదించాలని వారు కోరారు.



ఆసక్తిగా పప్పెట్రీ విద్యాబోధన

నాగులుప్పలపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పప్పెట్రీ విద్యాబోధన ఆసక్తిగా ఉంటుందని ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, రమణయ్య పేర్కొన్నారు. నాగులుప్పలపాడులో ఎస్జీటీగా పనిచేస్తున్న వై.మంజుల ఢిల్లీలోని సీసీఆర్టీలో గత నెల పప్పెట్రీ ద్వారా విద్యాబోధనపై శిక్షణ పొంది సంస్థ డైరెక్టర్ వినోద్‌కుమార్ చే తులమీదుగా ధ్రువీకరణపత్రం పొందారు. శనివారం బి.నిడమానూరులో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులకు పప్పెట్రీ విధానం వివరించారు. అనంతరం ఎంఈవోలు మాట్లాడుతూ ఆసక్తి గల ఉపాధ్యాయులు శిక్షణ తీసుకోవచ్చని తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న మంజుల

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు

● ఎమ్మెల్యే దామచర్ల



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, పక్కన మేయర్ సుజాత, ర్యాలీని ప్రారంభిస్తున్న డీటీసీ సుశీల(ఇన్‌సెట్లో)

ఒంగోలు క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నూతన జీఎస్టీ తగ్గింపుతో పేదప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. శనివారం ఒంగోలులోని కాపు కళ్యాణమండపంలో నూతన జీఎస్టీపై అవగాహన కార్యక్రమాల ముగింపు సభ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ జీఎస్టీ తగ్గించడం వల్ల అన్ని వస్తువుల ధరలు తగ్గాయన్నారు. రైతులకు ట్రాక్టర్లు, నిత్యావసర వస్తువులు ధరలు తగ్గాయని చెప్పారు. పీఎం సూర్యఘర్ ద్వారా అందరూ సోలార్ విద్యుత్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఒంగోలు నగరంలో 25వేల మందికి ఉచితంగా సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. తద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించకుండా డబ్బు ఆదా చేసుకోవచ్చన్నారు. తొలుత స్థానిక విద్యుత్‌భవన్ దగ్గర నుంచి కాపు కళ్యాణమండపం వరకు విద్యుత్‌శాఖ, రవాణాశాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కాపు కళ్యాణమండపంలో నూతన జీఎస్టీతో తగ్గిన ధరల వివరాలతో వివిధ వస్తువులను ప్రదర్శనగా ఉంచారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, డీటీసీ ఆర్.సుశీల, జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల, ఈఈ హరిబాబు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్, సచివాలయ సిబ్బందికి నూతన జీఎస్టీపై ఎంపీడీవో డి.సురేష్‌బాబు అవగాహన సదస్సు కల్పించారు. ప్రజలకు జీఎస్టీ తగ్గింపు విషయం తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు హరిబాబు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు ఎన్‌వోసీ ఇప్పించాలి

● జిల్లా రొయ్యల రైతు సంఘం వినతి

ఒంగోలు నగరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రొయ్యల సాగు చేస్తున్న రైతులందరికీ స్థానిక రెవెన్యూ అధికారుల ద్వారా ఎన్‌వోసీ సర్టిఫికెట్లను ఇప్పించాలని జిల్లా రొయ్యల రైతు సంఘం నాయకులు కోరారు. శనివారం ఒంగోలులో కలెక్టర్ రాజాబాబును సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్గినేని గోపీనాథ్, ప్రధానకార్యదర్శి కుంతూరి సుబ్బారెడ్డి, ముట్టే ఏడుకొండలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రొయ్యల రైతులకు ఇస్తున్న పలు రాయితీలను పొందాలంటే కోస్టల్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఏపీ కోస్టల్ ఆక్వా డెవలప్‌మెంటు అథారిటీ నుంచి సర్టిఫికెట్ పొందాల్సి ఉందన్నారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే విద్యుత్ సబ్సిడీ రొయ్యల సాగుదారులకు అందాలంటే సీవోసీ సర్టిఫికెట్లు అవసరమని తెలిపారు. జిల్లాలో టంగుటూరు, శింగరాయకొండ, ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, జరుగుమల్లి మండలాల పరిధిలో దాదాపు 18 వేల ఎకరాల్లో రొయ్యల చెరువులు ఉన్నాయన్నారు. గ్రామాల్లో వీఆర్వోలు అందుబాటులో లేక ఇప్పటి వరకు ఎన్‌వోసీలు రాక ఇప్పటికీ ఆక్వా రైతులు సీవోసీ సర్టిఫికెట్లు పొందలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్వోలను అందుబాటులో ఉంచి ఎన్‌వోసీలు ఇప్పించి సీవోసీ సర్టిఫికెట్లు పొందేందుకు అవకాశం కల్పించాలని వారు కలెక్టర్‌ను కోరారు.



కలెక్టర్ రాజాబాబుకు బొకేను అందజేస్తున్న రొయ్యల రైతుల సంఘం నాయకులు

బాలికల వసతిగృహంలో సమస్యలను పరిష్కరించాలి

● సీపీఎం నాయకుల డిమాండ్

కొత్తపట్నం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కొత్తపట్నంలోని ప్రభుత్వ బాలికల వసతిగృహంలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు కంకణాల రమాదేవి, మండల కార్యదర్శి ఎస్.స్వామిరెడ్డి స్థానిక బాలికల వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. వసతిగృహం చుట్టూ వర్షపునీరు చేరి ఉండటంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సరైన సౌకర్యాలు లేకపోవటంతో 65 మంది విద్యార్థినులు హాస్టల్‌లో ప్రవేశం పొందగా వారిలో కొంతమంది మానుకుని ఇళ్ళకు వెళ్ళారన్నారు. ప్రహరీ లేకపోవటంతో పాములు, విషపురుగులు సంచరిస్తున్నాయని, దీంతో విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారన్నారు. తాగునీటి సరఫరా కూడా సక్రమంగా లేదని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.



హాస్టల్‌ను అనుకుని ఉన్న నీటినిల్వలను చూపిస్తున్న విద్యార్థులు, రమాదేవి

ఆశ్రమ పాఠశాల భవనాన్ని త్వరగా పూర్తి చేయాలి

పొన్నలూరు: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల నూతన భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న భవనంలో గొర్రెలు ఉండటం చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలోని 140 మంది విద్యార్థులు సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నూతన భవనాన్ని 70శాతం పూర్తి చేసిన తర్వాత గత ఐదేళ్లుగా పట్టించుకోకపోవడం అది అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందన్నారు. ప్రభుత్వం అవసరమైన నిధులు కేటాయించి త్వరగా భవనాన్ని పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, ఎస్ఎఫ్ఐ నేతలు కేజీ.మస్తాన్, పాండు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

త్వరలో నూతన కానిస్టేబుళ్లకు శిక్షణ : ఎస్పీ

ఒంగోలు క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో పోలీసులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్పీ వి.హర్షవర్ధనరాజు తెలిపారు. ఈమేరకు శనివారం స్థానిక పోలీస్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. త్వరలో 208మంది కానిస్టేబుళ్ళ శిక్షణకు రానున్నారని తెలిపారు. వారికి అన్ని సౌకర్యాలు ఉండేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, డీఎస్పీలు ఆర్.శ్రీనివాసరావు, సాయిఈశ్వర్‌యశ్వంత్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై సమీక్ష

చీమకుర్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఈఆర్వో కె.మాధూరి పలు రాజకీయపార్టీల ప్రతినిధులు, అధికారులతో ఓటర్ల జాబితాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఓటర్లకు ఆధార్ సీడింగ్, నూతన ఓటర్ల నమోదు, తొలగింపులు, సవరణలకు ప్రతి పోలింగ్‌స్టేషన్‌లో ఒక బీఎల్‌ఏను నియమించామని, వారు ఓటర్లలిస్ట్‌లో పేర్లను మ్యాపింగ్ చేసే పనిలో ఉన్నారని తెలిపారు. ఓటర్ల స్వచ్ఛీకరణకు సహకరించాలని రాజకీయపార్టీల నాయకులను కోరారు. సమావేశంలో తహసీల్దార్లు ఆర్.బ్రహ్మయ్య, నారాయణరెడ్డి, ప్రవీణ్‌కుమార్, డీటీలు అజయ్, పి.అరుణ, అనూష, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొప్పోలు రోడ్డుకు మరమ్మతులు

ఒంగోలు(రూరల్), అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని కొప్పోలు రోడ్డుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం మరమ్మతు పనులు చేపట్టారు. ఈ తారురోడ్డులో వర్షపు నీటితో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో అధికారులు క్యారీడస్ట్‌తో ఆయా గుంతలను పూడ్చి వేసేలా చర్యలు తీసుకున్నారు. అయితే ఈ క్యారీ డస్ట్‌లో పెద్దరాళ్లు ఉండటంతో వాటితోనే గుంతలు పూడ్చారు. ఈక్రమంలో వాటి గుంత ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్యారీడస్ట్‌లో రాళ్లు తొలగించకుండా గుంతలు పూడ్చటం విమర్శలకు తావిస్తున్నది. ఈ రోడ్డులో నిలిచిన వర్షనీటిని తక్షణమే బయటకు పంపేలా చర్యలు తీసుకుంటునే ఈ గుంతలను నివారించవచ్చు. స్థానిక ఎన్టీఆర్ కాలనీ వద్ద పూడ్చిన కల్వర్టును పునరుద్ధరిస్తేనే సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు చెబుతున్నారు.

వాయుకాలుష్యాన్ని తగ్గించాల్సిన బాధ్యత అందరిదీ

- బంగ్లా నుంచి నడుచుకుంటూ వచ్చిన కలెక్టర్
- కలెక్టరేట్‌లోకి వాహనాల అనుమతికి నిరాకరణ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : వాయుకాలుష్యాన్ని తగ్గించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ పీ రాజాబాబు అన్నారు. రోజువారీ కార్యక్రమాలలో ఈదిశగా దృష్టిసారించాలని పిలుపు నిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం క్లీన్ ఎయిర్ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. కలెక్టర్ రాజాబాబు కలెక్టర్ బంగ్లా నుంచి పలు శాఖల అధికారులు,సిబ్బందితో కలిసి నడుచుకుంటూ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ వాయు కాలుష్యాన్ని నివారించేందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను అనుసరించాలన్నారు. కార్యాలయాలకు, ఇతర అవసరాలకు బయటకు వెళ్లేవారు దగ్గరలో అయితే నడుచుకుంటూ లేదా సైకిల్ తొక్కుకుంటూ వెళ్లాలని తెలిపారు. దూరమైతే వ్యక్తిగత వాహనాలు కాకుండా ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించుకోవాలని సూచించారు. తద్వారా పర్యావరణంలో వాయుకాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నాలలో భాగ స్వామ్యులు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వాయు కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకునేలా బాధ్యతాయుతంగా ప్రవరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేశు, ఈఎస్ ఆయేషా బేగం, డీఈవో కిరణ్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, డీఎల్‌పీవో పద్మ, కలెక్టరేట్ ఏవో రవికుమార్ పాల్గొన్నారు.


పాకల తీరంలో పర్యటిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ రాజాబాబు

పాకలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం


- మంత్రి డాక్టర్ స్వామి
- కలెక్టర్ రాజాబాబుతో కలిసి తీరంలో పర్యటన
- జిల్లా అధికారులతో సమీక్ష

సింగరాయకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పాకల తీరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. శనివారం ఆయన కలెక్టర్ పి.రాజాబాబుతో కలిసి పాకల తీరంలో పర్యటించారు. అనంతరం ఇద్దరూ కలిసి బీచ్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో బీచ్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను గుర్తు చేశారు. తాను టూరిజం రెస్టారెంట్ నిర్మాణానికి రూ.4కోట్లు తీసుకొచ్చి సగభాగం పూర్తిచేసిన భవనాన్ని వైసీపీ ప్రభుత్వంలో అర్థంతరంగా నిలిపివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో పర్యాటకరంగం పూర్తిగా కుదేలైందని ధ్వజమెత్తారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో పర్యాటక అభివృద్ధిపై మళ్లీ దృష్టి సారించామని తెలిపారు. పాకలలో ఆగిపోయిన టూరిజం పనులను కొనసాగిస్తామని వెల్లడించారు. పర్యాటకులను ఆహ్లాదాన్ని కలిగించే విధంగా పాకల బీచ్‌ను తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ పాకల బీచ్‌లో పర్యాటకుల సౌకర్యార్థం త్వరలో మరుగు దొడ్లు, స్నానపు గదులు, దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక గదులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. బీచ్ పరిసర ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. అనంతరం మంత్రి, కలెక్టర్ బీచ్ పరిసర ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కళావతి, జడ్పీ సీఈవో చిరంజీవి, డీపీవో వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ వెంకటేశ్వరరావు, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, పర్యాటకశాఖ అధికారి రమ్య, ఆర్టీసీ ఆర్ఎం సత్యనారాయణ, పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ నిర్మాణానికి రూ.2.20 కోట్లు మంజూరు

సింగరాయకొండలో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి రూ.2.20 కోట్లు మంజూరైనట్లు మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి వెల్లడించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయన శనివారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. అక్కడ మొక్కలను నాటారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్టేషన్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. అధునాతన పరిజ్ఞానంతో మోడల్ పోలీస్ స్టేషన్‌ను నిర్మించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ హజరత్తయ్య, ఎస్సైలు మహేంద్ర, నాగమల్లేశ్వరరావు. అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు కంభం విద్యార్థుల ఎంపిక


షేక్ మహమ్మద్ | షేక్ నజీర్

కంభం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అండర్ -19 క్రీడల్లో తమ ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏ సైమన్ విక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సింగరాయకొండలో జరిగిన ప్రావీణ్య పరీక్షలో 3కిలోమీటర్లు, 5కిలోమీటర్లు, జాగింగ్‌లో ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థి షేక్ నజీర్ ఎంపిక కాగా, కబడ్డీ జట్టుకు ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థి షేక్ మహమ్మద్ ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఏలూరు సమీపంలో జరిగే పోటీలకు హాజరవుతారని తెలిపారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్, ఇంటర్ విద్యా మండలి పరీక్షల నియంత్రణ అధికారి ఏ సైమన్ విక్టర్, కళాశాల అధ్యాపకుల బృందం అభినందించారు.



రాక్షస సంహారం లోక కల్యాణం

దీపావళి పండుగను ప్రజలు జరుపుకోవటం వెనుక ఒక పౌరాణిక ప్రాశస్త్యం ఉంది. లోకకంటకుడైన నరకాసురుడిని శ్రీకృష్ణుని సతీమణి సత్యభామ వధించటం వలన తమ కష్టాలు తొలిగిపోయాయన్న ఆనందంలో ప్రజలందరూ ఊరంతా దీపాలను వెలిగించి పండుగ జరుపుకుంటారు. అందుకే దీన్ని 'దీపావళి' అంటారు. ఆశ్వయుజమాసంలో అమావాస్యని దీపావళి పండుగ్గా జరుపుకుంటే ఆ ముందు రోజైన చతుర్దశి రోజున సత్యభామ నరకాసురుడిని వధించిందని పురాణాలు చెబుతున్నాయి. దేశమంతా దీపావళిని ఆనందంగా జరుపుకుంటూ, నరకచతుర్దశి రోజున చిన్నపాటి నరకాసుర బొమ్మను తయారు చేసి దహనం చేస్తాయి. కానీ ఒంగోలు ప్రజలు మాత్రం నరకచతుర్దశిని సైతం ఎంతో విభిన్నంగా జరుపుకుంటారు. 1902వ సంవత్సరంలో అంటే 123 సంవత్సరాల కిందట నగరంలో ప్రారంభమైన ఈ 'నరకాసుర వధ' రాష్ట్రంలో కేవలం ఒంగోలుకు మాత్రమే ప్రత్యేకం.

- నేడు నరకచతుర్దశి
- కనులవిందుగా జరిగే నరకాసురవధ పౌరాణిక ఘట్టం
- రాష్ట్రంలో ఒంగోలుకే ప్రత్యేకం
- వివిధ వేషధారణలు, డప్పువాద్యాలతో కోలాహలం
- టపాసులతో సందడి చేయనున్న పిల్లలు, పెద్దలు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):దీపావళి పండుగ వచ్చిందంటేనే ఊరుఊరంతా సందడిగా మారుతుంది. టపాకాయల మోతలు, చిచ్చుబుడ్ల వెలుగులతో చిన్నాపెద్దా తేడాలేకుండా అందరికీ ఆనందకాంతులను పంచిఇచ్చే ఏకైక పండుగ దీపావళి.దీపావళి పండుగను ఆశ్వయుజ అమావాస్య రోజు జరుపుకుంటారు.

నగరంలోని తూర్పుపాలెంలో ఈ నరకాసురవధ కార్యక్రమం 1902వ సంవత్సరంలో ప్రారంభమైంది. అప్పట్లో తూర్పుపాలెం నివాసి సింగరాజు సుబ్బయ్య అనేవ్యక్తి ఈ నరకాసురవధ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పెద్దలు చెబుతారు. ఆ ఆచారం తరాలు మారినా నేటికీ కొనసాగుతూనే ఉంది. సహజంగా గడ్డితో నరకాసురుని బొమ్మను తయారుచేసి నరక చతుర్దశి రోజు తెల్లవారుజామునే పిల్లలు తమ ఇంటి ముందు ఆ బొమ్మను తగులబెట్టటం అనాదిగా వస్తున్న ఆచారం. అనేక చోట్ల ఈ గడ్డిబొమ్మను తయారుచేసేటప్పుడు అందులో ఉప్పును వేస్తారు. దీంతో బొమ్మ తగులబడే సమయంలో చిటపట శబ్దాలు చేస్తూ సందడి చేస్తుంది. అయితే ప్రస్తుతం చాలామంది ఆ బొమ్మలో చిన్నచిన్న టపాసులను ఉంచుతున్నారు. నరకాసురుని బొమ్మ తగులబడే సమయంలో అవి పేలి శబ్దాలు చేస్తుంటే చిన్నా పెద్దా అందరూ ఎంతో హుషారుగా చూస్తుంటారు. అయితే నరకాసుర వధను ప్రజలకు కళ్లముందు సాక్షాత్కరింపజేయాలనే ఉద్దేశంతో 123 సంవత్సరాల కిందట ఒంగోలులో ఈ నరకాసురవధ ఘట్టం ప్రారంభించినట్లు చెబుతారు.

నరకచతుర్దశి రోజు రాత్రి దాదాపు 12 గంటల సమయంలో ఈ నరకాసురవధ కార్యక్రమం ప్రారంభమవుతుంది. వేలాదిగా ప్రజలు పాల్గొనే ఈ కార్యక్రమం దాదాపు 5 గంటలపాటు కొనసాగుతుంది. ఇందులో కొంతమంది శ్రీకృష్ణుడు, సత్యభామ, నరకాసురుడు వేషధారణలను చేసుకుని పాల్గొంటారు. తూర్పుపాలెం శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం కూడలి వద్ద నుంచి ముందుగా శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారులు ఎక్కిన వాహనం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసే డప్పువాయిద్యాలు, మేళతాళాలతో ఆ ప్రాంతమంతా సందడి నెలకొంటుంది. ఆ వాయిద్యాలకు తగిన విధంగా ఎంతో ఉత్సాహంతో ప్రజలు నృత్యాలు చేస్తూ సందడి చేయటం చూసితీరాల్సిందే. తూర్పుపాలెం వద్దనుంచి శ్రీకృష్ణుడు, సత్యభామల రథం ప్రారంభమైన కొంతసేపటి తర్వాత నరకాసురుని వాహనం బయల్దేరుతుంది. ఇక అక్కడి నుంచి ఈ వాహనాలు నగరంలోని బి.వి.ఎస్ థియేటర్, ట్రంకురోడ్డు, అంబేడ్కర్ విగ్రహం, రాజాపానగల్ రోడ్డు, లాయర్‌పేట, కొత్తపేట తదితర ప్రధాన రహదారులగుండా కొనసాగి దీపావళి రోజు తెల్లవారుజామున పప్పుబజారులోని గాంధీవిగ్రహం వద్దకు ముందుగా శ్రీకృష్ణుని వాహనం, ఆ తర్వాత నరకాసురుని వాహనం చేరుకుంటాయి.

ఈ నరకాసురవధ కార్యక్రమంలో శ్రీకృష్ణునికి నరకాసురునికి మధ్య జరిగిన సంవాదానికి సంబంధించిన పలు పౌరాణిక పద్యాలను కళాకారులు రాగయుక్తంగా ఆలపిస్తారు. అదేవిధంగా పదిచేతులతో, పొడవైన ఎర్రని నాలుకతో, పదునైన కోరలతో నరకాసురుని వేషధారి అచ్చం రాక్షసరాజులాగా చేసే సందడి ప్రజలను ఉల్లాసపరుస్తుంది. దాదాపు 3 నుంచి 4 లక్షల రూపాయల ఖర్చుతో నిర్వహించే ఈ నరకాసురవధ కార్యక్రమం ఎన్నో సంవత్సరాలుగా పలువురు యువకులు నిర్వహిస్తున్నారు. తమ పూర్వీకుల నుంచి ఈ ఆచారం వస్తున్నదని, దీనిని తాము కొనసాగిస్తున్నామని, పండుగల విశిష్టతను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన ఇటువంటి కార్యక్రమాలు మన పౌరాణిక సంపదను, సంస్కృతిని కాపాడటానికి ఎంతో ఉపయోగపడతాయని వారు చెబుతారు.


నరకాసురుడి వేషధారణలో కళాకారుడి విన్యాసం

ఇక ఇటీవల కొన్ని సంవత్సరాలుగా ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో భారీ నరకాసుర బొమ్మను తయారుచేసి స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్‌లో నరకాసుర దహనం కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను హుషారెత్తిస్తాయి. ఈ విధంగా ఒంగోలు నగరప్రజలకు కేవలం దీపావళి పండుగ మాత్రమే కాకుండా, నరక చతుర్దశి సైతం ఎన్నో మధురానుభూతులను మిగులుస్తుంది.

ధనత్రయోదశికి ధరాఘాతం

- అందుబాటులో లేని బంగారం ధర
- నిత్యం పెరుగుదలతో తగ్గిపోయిన కొనుగోళ్లు
- వ్యాపారాలు లేక దుకాణాలు వెలవెల



ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ధన త్రయోదశి (శనివారం) కావడంతో వ్యాపారులు బంగారం అమ్మకాలు బాగా జరుగుతాయని ఆశించారు. కానీ వారికి నిరాశే మిగిలింది. జిల్లా కేంద్రమైన ఒంగోలులో గాంధీరోడ్డులో మొత్తం బంగారం షాపులే ఉంటాయి. అయితే ఏ షాపులో కూడా కొనుగోళ్లు జరిగిన పరిస్థితి లేదు. అవిధంగా జిల్లా వ్యాప్తంగా సుమారు 150కిపైగా షాపులు ఉండగా ఆయాషాపుల్లో శనివారం మొదటి(బోణి) కొనుగోలు కూడా లేదని వ్యాపారులు చెప్పన్నారు.

చుక్కలు చూపిస్తున్న ధర

బంగారం ధర చుక్కలు చూపిస్తోంది, కనివిని ఎరగని రీతిలో రోజూ పెరుగుతోంది. దీంతో బంగారంఅంటేనే సామాన్యులు జంకాల్సిన దుస్థితి నెలకొంది. అంతర్జాతీయంగా మార్కెట్లో బంగారానికి మరింత డిమాండ్ ఏర్పడటంతో కొనేందుకు ముందుకు వచ్చే పరిస్థితి లేదు. గత కొంత కాలంగా బంగారం ధరలు నిత్యం పెరుగుతూ ఉన్నాయి. శనివారం ఎనిమిది గ్రాముల బంగారం ధర రూ. 97,500లకు చేరింది. మదుపరులు మాత్రం ఇంకా ధర పెరుగుతుందనే ఆశతో మేలిమి బంగారం బిస్కెట్లు కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు పసిడి ఈటీఎఫ్(ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్)లలో, కమొడిటీస్ ఎక్స్ఛేంజ్‌లో గోల్డ్ ఫ్యూచర్స్‌పై పెట్టుబడులు పెడుతూనే ఉన్నారు. గతంలో ప్రపంచ వ్యాప్తంగా సంక్షోభ పరిస్థితులు ఏర్పడినప్పుడు, ఆర్థిక మాంద్యం ముంచుకొచ్చినప్పుడు, యుద్ధాలు జరిగినప్పుడు బంగారం ధర పెరుగుతున్నట్లు చరిత్ర చెప్తుంది. అలా కొవిడ్ సమయం నుంచి బంగారం ధర అమాంతంగా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం బంగారం ధరల పెరుగుదలతో ఆ వైపు చూడాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏదో వివాహాలు ఉండి తప్పని పరిస్థితుల్లో మినహా కనీసం గ్రాము బంగారం కొనుగోలు చేసేందుకు కూడా వెనుకాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది గ్రాము బంగారం రూ. 7,500 వరకు ధర ఉండగా ప్రస్తుతం గ్రాము రూ. 12,187కు చేరింది. అంటే ఏడాది కాలంలో గ్రాముకు ఐదువేల మేర పెరిగింది.

బంగారంతో పోటీ పడుతున్న వెండి

వెండి ధరలు కూడా బంగారంతో పోటీ పడి పెరుగుతున్నాయి. శనివారం కిలో వెండి రూ. 1.82 లక్షలకు చేరింది. అంటే పది గ్రాముల వెండి రూ. 1,820కి చేరింది. బంగారంతో పాటు వెండి ధరలు కూడా చుక్కలుచూపిస్తుండటంతో అది కూడా కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు రెండువేలకు 20 గ్రాములు వచ్చే వెండి ఇప్పుడు పది గ్రాములు కూడా రావడం లేదు. ఈ ధరల పెరుగుదల వల్ల సామాన్యులు ఏ వస్తువూ కొనుగోలు చేసే అవకాశం లేకుండా పోయింది.

సీఐ అజయ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

ఎర్రగొండపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కే అజయ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వీఆర్ నుంచి బదిలీపై ఎర్రగొండపాలెం సీఐగా బదిలీ అయ్యారు. ఇక్కడున్న సీఐ సీహెచ్ ప్రభాకరరావు వీఆర్‌కు వెళ్లారు. కొత్తగ బాధ్యతలు స్వీకరించిన సీఐ అజయ్‌కుమార్ మాట్లాడుతూ శాంతి భద్రతలు పర్యవేక్షణకు, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	250.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	260.00

శివకాశి టూ ఒంగోలు

- బాణసంచా అక్రమాలపై కొరవడిన నిఘా
- అంతా జీరో వ్యాపారమే
- అధికారుల తనిఖీలు నామమాత్రం
- రూ. 20 కోట్లకుపైగా విక్రయాలు



ఒంగోలు క్రైం,అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ అంటే బాణసంచా కాల్చడం పరిపాటి. బాణసంచా తయారీకి తమిళనాడు రాష్ట్రంలో శివకాశి పెట్టిందిపేరు. దీంతో రెండుతెలుగు రాష్ట్రాలు కూడా శివకాశి నుంచి బాణసంచా తీసుకొచ్చి విక్రయాలు చేస్తుంటారు. అందుకు సంబంధించి హోల్‌సేల్ వ్యాపారులు అటు ప్రజల జేబులకు చిల్లు పెటడంతోపాటుగా, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. జిల్లాలో 14 మంది హోల్‌సేల్ వ్యాపారులు ఉండగా ఒంగోలులో ఉన్న ఓ వ్యాపారి ఇతర రాష్ట్రాలకు కూడా బాణసంచా సరఫరా చేసి సొమ్ము చేసుకుంటారు. అయితే దీపావళి పండుగ ఒక్కరోజు అయినా జిల్లాలో సుమారుగా రూ. 20 కోట్లకు పైగా బాణ సంచా విక్రయాలు జరిగే అవకాశం ఉంది. ఇలాంటి వ్యాపారం అక్రమాలకు అవధులు లేకుండా పోవడానికి కారణం అధికారులు పట్టించుకోకపోవడమే. బాణసంచా వ్యాపారం మొత్తం జీరోలోనే జరుగుతుంది. బాణసంచా వ్యాపారంలో 18 శాతం జీ ఎస్టీ చెల్లించాలి. జీఎస్టీ చెల్లించి శివాకాశి నుంచి వచ్చే బాణసంచా తక్కువగా ఉంటుంది.అదే క్రమంలో శివకాశి నుంచి తెచ్చిన బాణసంచా మొత్తం బిల్లులు లేకుండా వ్యాపారం చేస్తారు. అంటే అక్కడ ఎంతకు కొనుగోలు చేసింది, ఎంత మొత్తం బిల్లులపై తెచ్చారు అనేది ప్రశ్నార్థకం. ఇలాంటి వ్యాపారంపై అధికారుల నిఘా కొరవడడంతో ఇష్టారాజ్యంగా విక్రయాలు చేస్తూ,హోల్‌సేల్ వ్యాపారులే అధికధరలకు విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకుండా కేవలం బాణసంచా మత్తులో ఉండటంతో వ్యాపారులు చెలరేగుతున్నారు.





పేలుతున్న ధరలు

బాణసంచా ధరలు గత ఏడాది కంటే ఈ ఏడాది మండిపోతున్నాయి. సామాన్యులు టపాసుల ధరలు చూసిముక్కున వేలు వేసుకుంటున్నారు. ఐదు నుంచి ఆరువేల రూపాయలకు కొనుగోలు చేసినా చేతి సంచిలోకి రావడంలేదని పలువురు వాఖ్యానిస్తున్నారు. చిచ్చుబుడ్డి పట్టుకుంటే కాల్చకుండానే మంటలు వస్తున్నాయి. లక్ష్మీబాంబులు మోతమోగుతున్నాయి.. ఇలా ధరలు ఎగిసిపడుతున్నాయి. దీంతో టపాసులు కొనుగోలు చేయడం అంతంతమాత్రంగా ఉంది.

అనుమతులు లేకుండా విక్రయిస్తే కఠిన చర్యలు

బాణసంచా విక్రయదారులు నిబంధనలకు లోబడి విక్రయాలు చేయాలి. అనుమతులు లేకుండా టపాసులు తయారు చేయడం, అక్రమ రవాణా చేయడంపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశాం. డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశాం. జిల్లా వ్యాప్తంగా అనుమతిలేకుండా విక్రయాలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి రూ1,38,944 విలువ గల బాణసంచాను సీజ్ చేశాం. దీపావళి సందర్భంగా ఏవైనా అగ్నిప్రమాదాలు జరిగితే వెంటనే 101, పోలీసు డైల్ 100 లేక 112కు సమాచారం అందించాలి.

- ఎస్పీ వి.హర్షవర్ధనరాజు

నగరంలో 42 బాణసంచా దుకాణాలకు అనుమతి

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దీపావళి సందర్భంగా నగరంలో 42 బాణ సంచా దుకాణాలకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో అనుమతులిచ్చారు. ఈ మేరకు ఒంగోలులోని పీవీఆర్ బాలుర హైస్కూలు క్రీడా మైదానంలో ప్రత్యేకంగా టపాసుల అమ్మకాలు చేయనున్నారు. కాగా గతంలో షాపులకు విపరీతమైన పోటీ ఉండగా, ఈ ఏడాది 42 దరఖాస్తులు మాత్రమే రాగా, అన్నింటికీ అనుమతిలిచ్చారు. దీంతో పీవీఆర్ మైదానంలోనే షాపులు పెట్టుకోవాలని ఆదేశించారు. అయితే నివాసాల మధ్య టపాసులు అమ్మకూడదని, అలాగే వ్యాపార సముదాయాలు, బహిరంగ ప్రదేశాలలో షాపులు ఏర్పాటు చేయకూడదని హెచ్చరించారు. పీవీఆర్ మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాల ముందు తప్పనిసరిగా నీళ్ల డ్రమ్ములు, ఇసుక డ్రమ్ములు ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు.

వైభవంగా చెన్నుని శాంతి కల్యాణం

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామి వారికి శాంతి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి మూల విరాట్‌కు సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్య రంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ ఘట్టాలను నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో గోలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ

కొనకనమిట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినారికట్ల గ్రామంలో అంకాలమ్మ, గంగమ్మ, పోతురాజు, గమిటిశిల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో శనివారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని కాపాడే గ్రామ దేవతల విగ్రహాలు ప్రతిష్ఠించడం శుభపరిణామన్నారు. అనంతరం వేదపండితులు ఆయనకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆయనతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు మోరబోయిన బాబూరావు, మాజీ అధ్యక్షుడు తాతిరెడ్డి వెంకటేశ్వరెడ్డి, చినారికట్ల సొసైటీ అధ్యక్షుడు సానికొమ్ము వెంకటేశ్వరెడ్డి, చినారికట్ల టీడీపీ గ్రామ అధ్యక్షుడు కంది వెంకటరెడ్డి, చెరువు నీటి సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీనివాస రెడ్డి, ప్రముఖ న్యాయవాది ఉడుముల లక్ష్మిరెడ్డి, టీడీపీ నాయకులు మువ్వా కాటంరాజు, బరిగె బాలయ్య, వీరేపల్లి శ్రీనివాసులు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర సాధన


మార్కాపురంలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి


కంభంలో ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్, అధికారులు



వైపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఎంసీ చైర్మన్ చేకూరి, అధికారులు

స్వచ్ఛాంధ్ర ర్యాలీలో ఎమ్మెల్యే కందుల

మార్కాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర సాకారానికి ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛమైన గాలిపై శనివారం పట్టణంలో సైకిల్ ర్యాలీ జరిగింది. దోర్నాల బస్టాండ్ నుంచి కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. అందరూ కలిసి పురవీధుల్లో సైకిల్ తొక్కుతూ ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక గడియార స్తంభం వద్ద పారిశుధ్య కార్మికులు, పార్టీ నాయకులు, పుర ప్రజలతో ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుని అక్కడ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, మెప్మా అధికారి ఎలీషా, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ షెక్షావలి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీం ఖాన్, పార్టీ డాక్టర్ల విభాగం రాష్ట్ర నాయకులు డాక్టర్ షేక్ మౌలాలి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి భాధ్యత

సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం రూరల్ : పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని సబ్ కలెక్టర్ త్రివినాగ్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో బాగంగా తహసీల్దార్ చిరంజీవితో కలిసి సబ్‌కలెక్టర్ మొక్కలు నాటారు.

ఎర్రగొండపాలెం రూరల్ : జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉన్న కూలీలు, ప్రజలు మొక్కలు నాటాలని ఏపీవో శైలజ, ఐటీడీఏ ఏపీవో నాగేశ్వర రావు అన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శనివారం మండలంలోని నరసాయపాలెం గ్రామ కొండ ప్రాంతాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. మూగ జీవాలకు ఉపయోకరమైన చింత, మామిడి, సీతాఫలం మొక్కలను నాటారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు శ్రీనివాసరెడ్డి, రాణి, లక్ష్మణ్, ఫీల్డ్ అసిస్టెంట్ లు వెంకటేష్ యాదవ్, హనుమంతు, సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

తర్లుపాడు : ప్రతి విద్యార్థి తన పుట్టినరోజు నాడు మొక్కలు నాటి పెంచి పెద్దవి చేయాలని పోషించాలని లూథరన్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని కేజీయా రాణి సూచించారు. పాఠశాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్, టి.వెంకటరామిరెడ్డి, కిరణ్మయి, వెంకటయ్య, శాస్త్రి పాల్గొన్నారు.

కొనకనమిట్ల : స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తహసీల్దార్ ఆవుల సురేష్ కోరారు.అనంతరం కార్యాలయానికి వచ్చిన ప్రజలు, సిబ్బందితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏవో ప్రకాష్‌రావు, డీటీ అరుణ, ఆర్ఐ శ్రీనివాసరావు, పలువురు విఆర్‌వోలు, ప్రజలు పాల్గొన్నారు.

రాచర్ల : స్వర్ణాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన జాతీయ కాలుష్య నివారణ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండలంలోని సోమిదేవిపల్లిలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. నాయకులు అధికారులతో కలిసి స్వర్ణాంధ్ర సాధనకు తమ వంతు కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటేష్, పంచాయితీ కార్యదర్శి వైఎస్‌జి రంగనాయకులు, ఉపాధి హామీ ఈసీ జె నాగేశ్వరరావు, స్థానిక నాయకులు బి నాగేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఆర్ రమణ , సచివాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కంభం : స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తహసీల్దార్ కిరణ్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీని నిర్వహించారు. విద్యార్థులు, అధికారులతో కలిసి కందులాపురం సెంటర్ నుంచి కార్యాలయాల వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించి వాయు కాలుష్య నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో అబ్దుల్ సత్తార్, ఈవోఆర్డీ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పీ రామసుబ్బయ్య, టీడీపీ మండల నాయకులు చిట్యాల వెంగళరెడ్డి, కంచర్ల సత్యనారాయణగౌడ్, తోట మహేష్, కొత్తమాసు సుబ్రమణ్యం, చేదూరి కిశోర్, మండల పరిషత్, సచివాలయం ఉద్యోగులు, టీడీపీ, జనసేన నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : మొక్కల పెంపకంతోనే కాలుష్య నివారణ సాధ్యమని ఎంపీడీవో నాసర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల అధికారులు, నాయకులు శనివారం పంచాయతీ కార్యాలయం నుంచి నటరాజ్ కూడలి వరకు స్వచ్ఛాంధ్రపై సైకిలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున నాయుడు, ఎంఈవో మస్తాన్ నాయక్, సర్పంచ్ చిత్తూరి హారిక, సొసైటీ అధ్యక్షుడు బట్టు సుధాకర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ మాబు, నాయకులు దొడ్డా శేషాద్రి, చంటి, చెంచయ్య, షేక్ మౌలాలి పాల్గొన్నారు.


శనగ విత్తనాలకు పర్మిట్‌లు ఇస్తున్న వ్యవసాయాధికారులు

సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీ

తర్లుపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సన్న, చిన్నకారు రైతులకు 20 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి జోత్స్నదేవి అన్నారు. తర్లుపాడు, సీతనాగులవరం రైతు సేవా కేంద్రాలలో శనగ విత్తనాల పర్మిట్లను మార్కాపురం వ్యవసాయ శాఖ సంచాలకులు టి.బాలాజీ నాయక్ పంపిణీ చేశారు. ఒక్కొక్క రైతుకు 5 ఎకరాలకు 200 కేజీల వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో దేవేంద్రగౌడ్, వ్యవసాయ సహాయకులు సావిత్రి పాల్గొన్నారు.

మినుము సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కొనకనమిట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మినుమ సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు తెలిపారు. మండలంలోని నాగంపల్లి గ్రామంలో శనివారం టీబీజీ 104 రకం మినుము విత్తనాలను రైతులకు దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు రమేష్, వెంకటేశ్వరెడ్డి మాట్లాడుతూ టీబీజీ 104 రకం మినుము 80 నుంచి 85 రోజుల్లో పంట వస్తుందన్నారు. దిగుబడి 6 నుంచి 8 క్వింటాళ్ల ఉంటుందన్నారు. ఇది పల్లాకు తెగులు తట్టుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఏవో కే. ప్రకాష్‌రావు, చినారికట్ల సొసైటీ అధ్యక్షులు సానికొమ్ము వెంకటేశ్వరెడ్డి, వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాకల బీచ్‌కు బస్సులు

పొదిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పొదిలి నుంచి పాకల బీచ్ వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రజలు వినియోగించుకోవాలని ఆర్టీసీ డీఎం శంకరరావు కోరారు. ఎప్పుడు లేని విధంగా సందర్శకుల కోసం ప్రత్యేకంగా పాకలబీచ్‌కు బస్సును నడుపుతున్నట్లు చెప్పారు. ఈ బస్సులో మహిళలకు స్త్రీశక్తి వర్తిస్తుందన్నారు. ఉదయం 7.15, 8.15, 9.15, 10.15 గంటలకు తిరిగి మధ్యాహ్నం 1.45, 2.45 గంటలకు బస్సులు ఇక్కడి నుంచి బయలుదేరుతాయన్నారు. పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.50 చార్జీని నిర్ణయించినట్లు తెలిపారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

ఎమ్మెల్యే కందుల

కొనకనమిట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్తలకు అన్నివేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని చినారికట్ల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త కుర్రా శ్రీనివాసులు కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన శ్రీనివాసులు కుటుంబాన్ని ఆదుకుంటానని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు రూ.లక్ష నగదును కందుల అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మోరబోయిన బాబూరావు, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖ్‌దేవ్, చినారికట్ల సొసైటీ అధ్యక్షుడు సానికొమ్ము వెంకటేశ్వరెడ్డి, టీడీపీ నాయకులు కంది వెంకటరెడ్డి, మువ్వా కాటంరాజు, వీరేపల్లి శ్రీనివాసులు, పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సొసైటీ బ్యాంక్ చైర్మన్ కుమారుడు మృతి

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి నివాళి


రాజ్‌కుమార్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సంజీవరాయునిపేట సొసైటీ బ్యాంక్ చైర్మన్ ముచ్చుకుంట్ల రామసుబ్బయ్య కుమారుడు రాజ్‌కుమార్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. రాజ్ కుమార్ మృతిపట్ల ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అశోక్ రెడ్డి రాజ్‌కుమార్ మృతదేహంపై పూలమాలలు వేసి శనివారం నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. రాజ్‌కుమార్ తండ్రి రామసుబ్బయ్యను ఎమ్మెల్యే ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో మడల పార్టీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్య, జడ్పీటీసీ సభ్యుడు బుడతా మధుసూదన్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, సొసైటీ బ్యాంకు చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, నాయకులు నంది శ్రీను ఉన్నారు.

ప్రజా సహకారంతో పట్టణ రూపురేఖలు మారుస్తా

నగరపంచాయతీ కమిషనర్ కేఎల్‌ఎన్‌రెడ్డి

పొదిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు సహకారంతో పొలిలి పట్టణ రూపురేఖలను మారుస్తానని నగరపంచాయతీ కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి అన్నారు. శనివారం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పెరిగిన జనాభాకు అవసరమైన మౌలిక వసతులు మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్న దృష్ట్యా సమస్య పరిష్కారానికి ప్రజలు సహకరించాలన్నారు. సుందరీకరణలో భాగంగా డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడంద్వారా నూతన శోభతోపాటు ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. అక్రమ కొళాయి కనెక్షన్‌ల క్రమబద్ధీకరణతో ఆదాయం పెరుగుతుందన్నారు. రోడ్డు మార్జిన్‌లు, కాలువలను ఆక్రమించడం ద్వారా మురుగునీటి పారుదల సమస్య తలెత్తుతోందన్నారు. రోడ్లపైకి నీరు వస్తుండడంతో తరచూ రోడ్లు మరమ్మతులకు గురవుతున్నాయని అన్నారు. పన్ను బకాయిలు రూ.4కోట్ల మేర ఉండడంతో అభివృద్ధి కుంటుపడుతుందని చెప్పారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు అందుబాటులో ఉన్న నిధులతో పట్టణంలో ఇప్పటికే ఆక్రమణలు తొలగించి, డ్రెయినేజీలు, రోడ్ల మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం నగరపంచాయతీ అధికారులు, టీడీపీ నాయకులు పెద్దబస్టాండ్‌లో స్వచ్ఛాంధ్రలో భాగంగా సైకిల్‌ర్యాలీని నిర్వహించారు.

విద్యుత్ ఉద్యోగుల ర్యాలీ

గిద్దలూరు టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ద్వారా విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తుందని సబ్ డివిజన్ అధికారి బి శేషగిరిరావు అన్నారు. శనివారం సూపర్ జీఎస్టీపై అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డీఈ శేషగిరిరావు మాట్లాడుతూ గృహాలపై సోలార్ ప్యానల్ అమర్చుకునేవారికి జీఎస్టీ 12శాతం నుంచి 5శాతం వరకు తగ్గించినట్లు చెప్పారు. వ్యవసాయ బోర్లకు కూడా జీఎస్టీ తగ్గిందని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణబాబు, మున్సిపల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, ఏఈలు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బాణసంచా అమ్మితే చర్యలు

త్రిపురాంతకం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా బాణసంచా అమ్మకాలు, నిల్వలు ఉంచినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని త్రిపురాంతకం సీఐ అస్సాన్ అన్నారు. సర్కిల్ పరిధిలోని కురిచేడు, దొనకొండ, త్రిపురాంతకం మండలాల్లో లైసెన్స్ పొందిన దుకాణదారులు మాత్రమే విక్రయాలు జరపాలని హెచ్చరించారు. జనావాసాలకు దూరంగా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని, పిల్లలను దుకాణాల్లో పనికి నియమించకూడదని నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెద్ద దోర్నాల : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసేవారు ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని ఎస్సై మహేశ్ శనివారం ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో బాణాసంచా విక్రయాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచినా, అనుమతులు లేకుండా విక్రయాలు జరిపినా చట్టపరంగా నేరమని దుకాణధారులను హెచ్చరించారు. బాణసంచా దుకాణాలు జనావాసాలకు దూరంగా ఉండాలన్నారు.

కొనకనమిట్ల : లైసెన్స్ లేకుండా బాణసంచా అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీకాంత్ హెచ్చరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం టపాసులు అమ్ముతున్న దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. చినారికట్లలో కుర్రా నరసింహారావు దుకాణాన్ని తనిఖీ చేసి అనుమతి లేకుండా బాణసంచా అమ్ముతున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతి తీసుకున్నవారు మాత్రమే టపాసులు అమ్మకాలు చేయాలని సూచించారు.

నవంబర్ 2న కోటి దీపోత్సవం

గిద్దలూరు టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో కార్తీక మాసం సందర్భంగా నవంబర్ 2వ తేదీన కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పట్టణానికి చెందిన పోలంరెడ్డి బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పట్టణ శివారులో నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించిన కోటి దీపోత్సవ పోస్టర్‌ను శనివారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమానికి వందమంది హిమాలయ సాధువులు పాల్గొని రుద్రాభిషేకం, మహాభస్మాభిషేకం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో శివారెడ్డి, చే రెడ్డి యర్రారెడ్డి, శ్రీను, కృష్ణ, మురళి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

శ్రీనివాసులుకు నివాళి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో మృతిచెందిన ఒబిలిబోయిన శ్రీనివాసులుకు బీసీ సంఘాల నాయకులు నివాళులర్పించారు. ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిసి సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి జాడి శ్వేత, బిసి సంఘాల నాయకులు డాక్టర్ జేవి నారాయణ, వెంకటయ్య యాదవ్, మణిచైతన్య, అద్దంకి మధుసూధన్ రావు, వర్రా భూపాల్, శింగరి సుబ్రమణ్యం, బాలచెన్నయ్య నివాళులర్పించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం


పాఠశాలను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

రాచర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామని రాష్ట్ర విద్యా మౌలిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్ గోన చెన్నకేశవులు, గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కటిక యోగానంద్ అన్నారు. శనివారం వారు ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డితో కలిసి రాచర్ల ఆదర్శ పాఠశాల బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాలల్లో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే హామీ మేరకు ఆయన సహకారంతో త్వరలో సింగిల్ ఫేస్ మోటార్‌ను ఏర్పాటు చేస్తామని అందుకు సంబంధించిన స్థలాన్ని కూడా వారు పరిశీలించారు. కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి, సంక్షేమానికి కట్టుబడి ఉందని అందుకు అవసరమైన నిధులను కూడా అధిక మొత్తంలో మంజూరు చేస్తుందని అన్నారు. ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధికి కృషి చేద్దామని వారు కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఐ వెంకటేష్, పాఠశాలల ప్రిన్సిపాల్స్ డీ మేరీ మంజుల, పీ మురళి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ నరేష్ రెడ్డి, ఉపాధి హామీ ఈసీ జే నాగేశ్వరావు, పంచాయతీ కార్యదర్శి ఎంవీ నాయక్, టీడీపీ నాయకులు డీ కాశిరెడ్డి, ఎస్.శ్రీనివాసులు, జీ వెంకటరామిరెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో విద్యార్థులకు ప్రయోజనం

గిద్దలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వం, సామాజిక చైతన్యాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి పీ స్వరూపరెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల ప్రశ్నపత్రాలను సూర్య విద్యానికేతన్ పాఠశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26జిల్లాలలో 4,60వేల మంది విద్యార్థులు చెకుముకి సైన్స్ సంబరాలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. మన జిల్లాలో సుమారు 30వేల మంది చెకుముకి సైన్స్ సంబరాలకు హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జన విజ్ఞాన వేదిక నాయకులు డీజీ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ జేవీవీ కృషిలో మనమందరం భాగస్వాములు కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ మదార్‌బాషా, బిజుజాకబ్, ఎస్‌వీ రమణ, కె విశ్వనాథ్, నాగూర్‌వలి, రంగారెడ్డి, రంగరాజన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కంభం : పోటీ పరీక్షలతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని జన విజ్ఞాన వేదిక సభ్యులు పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక కంభం మండల శాఖ ఆధ్వర్యంలో వీవీఎస్ జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్‌లో పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల ప్రశ్నాపత్రాన్ని ప్రధానోపాధ్యాయులు అమూల్య విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇటువంటి పోటీ పరీక్షలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. జేవీవీ మండల అధ్యక్షుడు వరికుంట్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మూఢనమ్మకాల నిర్మూలనలో జనవిజ్ఞాన వేదిక పాత్ర ఎనలేనిదని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నారపరెడ్డి రమణారెడ్డి, గౌరవాధ్యక్షులు, షేక్ సద్దాం హుస్సేన్, చెకుముకి కన్వీనర్ షేక్ నాయబ్ రసూల్, కోశాధికారి మస్తాన్, పాఠశాల ఉపాధ్యాయులు కేశవ, చంద్రశేఖర్ రెడ్డి, సుబ్బరాజు, రమేష్, నాగలక్ష్మి, ఎస్తేరు రాణి, పద్మావతి, సుశీల, జయ, సుబ్బలక్ష్మి, గౌసియాబి, పద్మ, జయమ్మ పాల్గొన్నారు. 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కాపురం : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరావు విజయవంతమయ్యాయని నాయకులు ఏనుగుల రవికుమార్ తెలిపారు. వివిధ పాఠశాలల్లో మొత్తం 1,800 మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారన్నారు. ఆయా పాఠశాలల్లో ప్రశ్నాపత్రాలను యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు ఆవిష్కరించనట్లు తెలిపారు.

ముందస్తు దీపావళి వేడుకలు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వాసవీ విద్యానికేతన్‌లో ముందస్తు దీపావళి వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కె.రంగయ్య దీపావళి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులు శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణతో అలరించారు. నరకాసురుడి బొమ్మను కాల్చారు. టపాసులు పేల్చి కోలాటమాడారు.

గిద్దలూరు : స్ప్రింగ్ బోర్డు స్కూల్‌లో గ్రీన్ దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేస్తూ టపాసులు లేకుండా పండుగ జరుపుకోవాలి సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డా.జేవి నారాయణ దీపావళి అంటే వెలుగులు, సంతోషం, మంచితనం విజయానికి ప్రతీక అని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జే శ్వేత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్తాచాటిన బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు


ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మార్కాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు కబడ్డీ పోటీల్లో సత్తాచాటినట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన బి.నాగరాజు, ఎం.అలి, టి.నాగవిష్ణులు కబడ్డీలో, కౌశిక్ చెస్ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. పల్నాడు జిల్లా, మన్యం జిల్లా పార్వతీపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరంతా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో పీడీలు డి.శ్యామలాదేవి, పి.దామోదర్‌రెడ్డి, కె.ఓబులేసు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగనాయక స్వామికి పూజలు

రాచర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జేపీ చెరువు అటవీ ప్రాంతంలోని శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు స్వామివారి దర్శనానికి అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈవో మల్లవరపు నాగయ్య భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

ముఖాముఖి

టపాసుల విక్రయదారులు నిబంధనలు పాటించాలి

బి.రమాదేవి, తహసీల్దార్, దొనకొండ



ప్రశ్న: దీపావళి టపాసుల విక్రయాలపై ఎటువంటి చర్యలు చేపట్టారు?

జవాబు: టపాసుల విక్రయదారులు దుకాణాల వద్ద ఇసుక బకెట్లు, డ్రమ్ముల్లో వాటర్, చిన్న బకెట్లు, వాహనాలు దూరంగా ఉంచేలా, విద్యుత్ వైర్లు భూమి మీదలేకుండా ఉండేలా తదితర ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయాలు జరుపుకునేలా ఆదేశాలు జారీ చేశాం. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు చేపడతామని సూచించాం.

ప్ర: మండలంలో రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ ఎంతవరకు పూర్తయింది ?

జ: 28 రేషన్‌షాపుల పరిధిలో 14,122 రేషన్‌కార్డులు మంజూరు అయ్యాయి. ఇప్పటికి 75శాతం మంది లబ్ధిదారులకు పంపిణీ చేశాం.

ప్ర: కొంతమంది ప్రభుత్వ ఉద్యోగస్తుకు రేషన్‌కార్డులు మంజూరైనట్లు జరుగుతున్న ప్రచారం వాస్తవమేనా ?

జ: ఒకరిద్దరు ఉద్యోగస్తులకు స్మార్ట్ రేషన్‌కార్డులు మంజూరైనట్లు తెలిసింది. అటువంటి కార్డులు పంపిణీ చేయకుండా నిలిపివేయాలని రేషన్ డీలర్లకు ఆదేశించాం.

ఘనంగా అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

పామూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనిమెర్ల గ్రామంలో వీర్ల అంకమ్మ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. కారంపూడి చెన్నకేశవస్వామి దేవస్థాన పీఠాధిపతులు తరుణ్ చెన్నకేశవ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. శ్రీహనుమాన్ స్టోన్‌క్రషర్ ఎండీ తిరివిధి జనార్దనరావు, టీడీపీ నాయకులు యారవ శ్రీను, బొల్లా నరసింహారావు, సర్పంచ్ సిద్దమూర్తి లక్ష్మీనారాయణరెడ్డి, తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

డాక్టర్ల సమ్మెతో ఇబ్బందులు పడుతున్న రోగులు

పామూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ల సమ్మెతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని బొట్లగూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒక డాక్టరు, పామూరు పీహెచ్‌సీలో ఇద్దరు, సీఎస్‌పురంలోని వైద్యశాలలో ఇద్దరు డాక్టర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు గత నెల 29 నుంచి డాక్టర్లు విధులకు హాజరుకాకుండా సమ్మెబాట పట్టారు. దాంతో ఆరోగ్య కార్యకర్తలే అరకొరగా వైద్య సేవలు అందిస్తున్నారు.

ఉపాధి కూలీలందరూ ఈకేవైసీ చేయించుకోవాలి

పామూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు ఉన్న కూలీలందరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీవో బి.మాల్యాద్రి పేర్కొన్నారు. శనివారం మండలంలోని వగ్గంపల్లి గ్రామంలో ఈకేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు తమ పరిధిలోఉన్న కూలీలతో ఈకేవైసీ చేయించాలన్నారు. దీనివల్ల దొంగ మస్టర్లు నివారించవచ్చునని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో గంధమహోత్సవం

పామూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీహజరత్ మౌలాలి సాహెబ్ స్వామి ప్రథమ గంధమహోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా దర్గాలో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు జరిపించుకున్నారు. దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. కార్యక్రమంలో షేక్ హాజీగౌస్, షేక్ ముబినామౌలాలి, కోడిగుంపుల నాయబ్‌రసూల్, తడికమళ్ల సుబ్బారావు, షేక్ దిల్‌దార్, పటాన్ ఖాజావలి, భక్తులు పాల్గొన్నారు.

వైసీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడిగా రాము

పామూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా తూర్పుకోడిగుడ్లపాడు గ్రామానికి చెందిన తాతపూడి రాము నియమితులయ్యారు. శనివారం వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

జాబ్ మేళాలో 16 మందికి ఉద్యోగాలు

దొనకొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గౌతమీ డిగ్రీ కాలేజీల చైర్మన్ గుండారెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో దొనకొండకు చెందిన 16 మంది ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎఫ్రాయిమ్(నాని) తెలిపారు. దొనకొండలోని గౌతమీ డిగ్రీ కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న 16 మంది విద్యార్థులు జాబ్ మేళాకు హాజరయ్యారు.

బెంగుళూరుకు చెందిన టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీలో రూ.25వేల వేతనంతో వీరికి ఉద్యోగాలు లభించాయి.

స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర నిర్మాణంలో భాగస్వాములు కావాలి



పామూరులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు

దర్శి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రగా అభివృద్ధి చేసేందుకు అందరూ భాగస్వాములు కావాలని తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య సూచించారు. దర్శిలో శనివారం కాలుష్య నివారణపై అవగాహన కల్పించేందుకు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య, కమిషనర్ మహేశ్వరరావు, ఎస్ఐ మురళీ తదితరులు మున్సిపల్ కార్యాలయం నుంచి శివరాజ్‌నగర్‌లోని మోడల్ స్కూల్ వరకు సైకిళ్లపై వెళ్లారు. అక్కడ మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల నుంచి సైకిళ్లపై దర్శి గడియారస్తంభం సెంటర్ వరకు తిరిగి వచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మోటార్ సైకిళ్ల వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గిస్తే కాలుష్య నివారణకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారి రవికుమార్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అసీనా భాను, విద్యాకమిటీ చైర్మన్ అనూష తదితరులు పాల్గొన్నారు.

పామూరులో..

పామూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు పిలుపునిచ్చారు. శనివారం జరిగిన కార్యక్రమంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి మమ్మీడాడి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ముందుగా గ్రామ పంచాయతీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గద్దె ఏడుకొండలు, టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, ఉప్పలపాటి హరిబాబు, అంచూరి వెంకటరెడ్డి, సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రికోటిరెడ్డి, పాలపర్తి రమణయ్య, వై.రహీముల్లా పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని బొట్లగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, పంచాయతీ కార్యదర్శి కె.కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో..

దొనకొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం దొనకొండలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ రమాదేవి కార్యాలయం ఆవరణలో మొక్కలునాటి పరిసరాలను శుభ్రం చేయించారు. మండల పరిషత్ కార్యాలయం, వెలుగు, ఉపాధిహామీ కార్యాలయాల వద్ద ఎంపీడీవో వసంతకుమార్‌నాయక్, కార్యదర్శి పోట్ల కృష్ణమూర్తి, ఏపీవో కల్యాణి తదితరులు మొక్కలు నాటి కార్యాలయాలు శుభ్రం చేశారు. అనంతరం దొనకొండలో సైకిల్ ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆయా శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

» ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు



మొక్కలు నాటుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తాళ్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రజాప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజల ఆరోగ్యపరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు చెప్పారు. మూడవ శనివారం ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలను శుభ్రపరిచి ఆహ్లాద వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టారన్నారు. ఎంపీడీవో పి.అజిత మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యంపై దృష్టిసారించి వ్యాయామం, మొక్కల పెంపకానికి ప్రాధ్యాన్యత నిచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ సైక్లింగ్ చేస్తే వ్యాధులు దూరంగా వుండి ఆరోగ్య వంతులుగా ఉంటారన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలునాటి సంరక్షించి వాతావరణ సమతుల్యాన్ని కాపాడాలన్నారు. మండల పరిషత్ కార్యా లయ ఆవరణలో ఎంపీపీ తాటికొండ శ్రీను, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, ఎంపీడీవో అజిత, అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ ఐ.వెంక టేశ్వరరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, బి.ఓబుల్ రెడ్డి, తూము శివనాగిరెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ బీవీ రమణారావు ఆధ్వర్యంలో సిబ్బంది కార్యాలయం ముందున్న చెత్తను ఊడ్చి శుభ్రం చేశారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు కనిగిరి విద్యార్థినుల ఎంపిక



జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన కనిగిరి విద్యార్థినులు

కనిగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఖోఖో పోటీలకు కనిగిరికి చెందిన విద్యార్థినులు ఎంపికైనట్లు ఖోఖో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.భాస్కర్‌రావు, బి.కాశీవిశ్వనాధరెడ్డి శనివారం తెలిపారు. ఈనెల 24 నుంచి 26వ వరకు కర్నాటక రాష్ట్రంలోని దావనగిరిలో జరిగే 31 దక్షిణ భారత ఖోఖో పోటీల్లో రాష్ట్ర జట్టులో కనిగిరికి చెందిన ఏడుగురు విద్యార్థినులు పాల్గొననున్నట్లు తెలిపారు. వీరు గత నాలుగు రోజుల నుంచి కృష్ణాజిల్లా గన్నవరంలో జరుగుతున్న శిక్షణ శిబిరంలో పాల్గొన్నట్లు తెలిపారు.

ఎంఎస్ఎం కళాశాలకు చెందిన యు.నాగమల్లేశ్వరి, ఎం.సఖియా, యు.శశికళ, ఎస్.పావని, ఆర్ .యశోద, ఎమ్మెస్సార్ కళాశాల నుంచి బి.గుణవతి, పి.అమృత ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు, ఎమ్మెస్సార్ కళాశాల ప్రిన్సిపాల్ టి.వెంకటరెడ్డి,



వెలిగండ్ల: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొననున్న బాలికల జట్టు

అడ్వైజర్ పి.కృష్ణారెడ్డి, ఖోఖో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, సీతారామిరెడ్డి, కోశాధికారి హనుమంతరావు, పీడీ కాశీవిశ్వనాధరెడ్డి అభినందించారు.

ఖోఖో అండర్ - 19 బాలికల జట్టు ఎంపిక

వెలిగండ్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలో వచ్చే నెలలో స్కూల్ గేమ్స్ పోటీలు జరగనున్నాయి. ఖోఖో అండర్ 19 బాలికల జిల్లా జట్టును శనివారం వెలిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపికచేశారు. ఈసందర్భంగా స్కూల్ గేమ్స్ కార్యదర్శి చింపారెడ్డి, పీడీలు శంకర్, కాశీవిశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో బాలికల జట్టు శిక్షణ శిబిరం కనిగిరిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం గౌసియా బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోలార్‌తో విద్యుత్ ఆదా చేసుకోవాలి



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

కనిగిరి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సోలార్ ఏర్పాటుతో విద్యుత్ ఆదా జరుగుతుందని డీఈ ఆర్. ఉమాకాంత్ అన్నారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్, స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కూటమి శ్రేణులు, నాయకులు, మున్సిపల్ అధికారులతో కలసి శనివారం పట్టణంలో అవగాహన ర్యాలీ, మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఉమాకాంత్ మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు సబ్సిడీతో సోలార్ ఏర్పాటుచేసుకుని విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవాలన్నారు.

మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో జరిగిన సైకిల్ ర్యాలీని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలన్నారు. ప్రతిఒక్కరూ గుడ్డ సంచులను వాడాలని, ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని విడనాడాలని సూచించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో పచ్చదనం, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్ల వెంట విరివిగా మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. అనంతరం రైతుబజార్ వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, అధికారులు, కూటమి నాయకులు తమ్మినేని వెంకటరెడ్డి, జంషీర్ అహ్మద్, అహ్మద్, నజిముద్దీన్, యారవ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

ముండ్లమూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని రక్షించు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని ఎంపీడీవో ఎం.శ్రీదేవి అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పెద ఉల్లగల్లు సచివాలయం వద్ద కూడా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో టి.వెంకటరావు, సూపరింటెండెంట్ అబ్దుల్ కరీం, ఎంఈవో షేక్ కాలేషావలి, ఈసీ శివరామకృష్ణ ప్రసాదు, సర్పంచ్ జనమాల నాగేంద్రం, పంచాయతీ కార్యదర్శి రాజ రాజేశ్వరి, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హిందీ ఉపాధ్యాయురాలు సుభాషిణికి పీహెచ్‌డీ

తాళ్లూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దికూరపాడు జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ హిందూ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న బద్రి సుభాషిణి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. హిందీ సాహిత్యంలో సమకాలిన హిందీ కవి శ్రీకేదార్నాద్ అగర్వాల్ కావ్యాలలో జీవన విలువలు అనే అంశంపై పరిశోధన చేశారు. అక్టోబర్ 16న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌డీ పట్టా అందజేశారు. ఈసందర్భంగా ఆమెను ఏపీటీఎఫ్ శాఖ , ఉపాధ్యాయులు అభినందించారు.

బిజినెస్ కరస్పాండెంట్ చేతివాటం!

» పొదుపు నగదు స్వాహా చేశారని బాధిత మహిళల ఆందోళన



ముండ్లమూరు బ్యాంక్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

ముండ్లమూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల నగదును బిజినెస్ కరస్పాండెంట్ స్వాహా చేశారు. దీంతో శనివారం మండలంలోని శంకరాపురంకు చెందిన పొదుపు సంఘాల మహిళలు ముండ్లమూరులోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ వద్ద ఆందోళన చెపట్టారు. శంకరాపురం గ్రామానికి చెందిన 40 పొదుపు సంఘాల గ్రూపులకు సంబంధించి ప్రతినెలా బ్యాంకుకు చెల్లించే నగదును బిజినెస్ కరస్పాండెంట్‌గా పనిచేస్తున్న ముట్లూరి సునీత స్వాహా చేశారని బాధిత మహిళలు తెలిపారు. తాము ప్రతినెలా నగదు చెల్లించినా అందులో కొంత నగదు వాడుకున్నట్లు తెలిసిందని ఆందోళన చేశారు. బ్యాంక్ మేనేజర్ సర్వేస్ మోహన్ త్రివేధి తమకు లిఖిత పూర్వకంగా డ్వాక్రా సభ్యులు రాసి ఇస్తే కొంత సమయం తీసుకొని ఎవరి గ్రూపులో ఎంత నగదు తీసుకుంది స్టేట్ రూపంలో ఇవ్వటం జరుగుతుందన్నారు. ఆందోళన చేపట్టిన పొదుపు సభ్యులు వెనక్కి తగ్గకుండా తాము పూర్తి స్థాయిలో చెల్లించినా కూడా కొంత భాగమే చెల్లించినట్లు ఉందని, బిజినెస్ కరస్పాండెట్ స్వాహా చేశారని ఆందోళన చేశారు. దీంతో చేసేది ఏమిలేక బ్యాంక్ అధికారులు పొదుపు గ్రూపుల వారీగా తాము చెల్లిస్తున్న ఎకౌంట్లను పరిశీలించారు. దీంతో కొన్ని గ్రూపులకు సంబంధించి రూ 7.50 లక్షలు నగదు చెల్లించ లేదని బ్యాంక్ అధికారులు తెలిపారు. పొదుపు సంఘాలు మాత్రం పెద్ద ఎత్తున తేడాలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బ్యాంక్ అధికారులతో పాటు తిరుపతి నుంచి వచ్చిన అత్యాడ్ టెక్నాలజీ వారు కూడా విచారణ చేపట్టారు. ఏపీఎం హనుమంతరావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా 40 గ్రూపులకు సంబంధించి రూ.7.50 లక్షలు మాత్రమే తేడాలు ఉన్నాయని తెలిపారు. అందులో కూడా రూ.5.50 లక్షలు ఇటీవల చెల్లించిందని, బ్యాంక్ విలీనం కావటం వల్ల అవి చూపించటం లేదని తెలిపారు. లక్ష రూపాయలు చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. బ్యాంక్‌లో ఆర్ఎం యూసఫ్ ఆలీ కూడా అధికారులతో సమావేశమై రికార్డులు పరిశీలించారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

కనిగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యనందించాలని జిల్లా విద్యాశిక్షణా పరిశీలకులు సంగా మహేంద్ర ఉపాధ్యాయులకు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో శనివారం రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు చాగంటి కోటేశ్వరరావు ప్రవేశపెట్టిన 'విలువలతో కూడిన సంపుటి'పై ప్రత్యేక చర్చ నిర్వహించి ఉపాధ్యాయులకు పాఠ్యాంశాల బోధనా తీరుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కలవ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు భూముల పరిశీలన

పీసీపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లోఓల్టేజీ సమస్య పరిష్కారం కోసం కేంద్రప్రభుత్వం సహకారంతో పీఎం కుసుమ్ పథకం కింద సోలార్ ప్రాజెక్టు మంజూరయిందని ఈఈ ఉమాకాంత్ తెలిపారు. ఈప్రాజెక్టుకు అవసరమైన భూముల కోసం శనివారం విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉపకేంద్రానికి రెండు కి.మీ దూరంలో 13.5 ఎకరాల భూమి అవసరమవుతుందని చెప్పారు. భూములు ఇచ్చే రైతులకు ఏడాదికి ఎకరాకు రూ.30 వేలు కౌలు ఇస్తున్నట్టు చెప్పారు. పతి రెండు సంవత్సరాలకొకసారి ఐదు శాతం చొప్పున కౌలు పెంచుతారన్నారు. సోలార్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన తరువాత మండలంలో లోఓల్టేజీ సమస్య తీరుతుందన్నారు. భూములు ఇచ్చేందుకు ఆసక్తి కలిగిన రైతులు 9440812197 నెంబరును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏఈ పవన్‌కుమార్, నెడ్‌క్యాప్ ప్రతినిధి మురళీక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు దీపావళి వేడుకలు

పామూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ మార్క్స్ హైస్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తులను ధరించి ప్రమిదలు వెలిగించారు. కరస్పాండెంట్ ఎం.జయకుమార్ మాట్లాడుతూ చెడుపై మంచి విజయం సాధించిన రోజున దీపావళి పండుగను జరుపుకోవడం అనాదిగా వస్తుందన్నారు.

పాకల బీచ్‌కు ప్రత్యేక బస్సులు

దొనకొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పాకల బీచ్‌కు పొదిలి ఆర్టీసీ డిపో నుండి బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ వి.శంకర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం క్రింద మహిళలకు ఉచిత ప్రయాణం, పురుషులకు రూ.100, పిల్లలకు రూ.50 టికెట్ నిర్ణయించినట్లు తెలిపారు. ఈబస్సులను ప్రతి ఆదివారం ఉదయం 7.15 గంటలకు, 8.15, 9.15, 10.15, మధ్యాహ్నం 1.45, 2.45 గంటలకు ఏర్పాటుచేసినట్టు పేర్కొన్నారు. ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

దర్శి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుతో అందుతున్న రాయితీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఈఈ పి.శ్రీనివాసులు కోరారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జీఎస్టీపై అవగాహన కల్పించేందుకు శనివారం దర్శిలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ ప్యానల్స్ అమర్చుకునే వారికి జీఎస్టీ 12 నుంచి 5 శాతంకు తగ్గించినట్టు చెప్పారు. కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో పి .కల్పన, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై.మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

దర్శి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర నిర్మాణంలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని దర్శి ఎక్సైజ్ సీఐ కె.శ్రీనివాసరావు సూచించారు. శనివారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద పలు ప్లాస్టిక్ వస్తువులు పగులకొట్టి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవటంతోపాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా విక్రయదారులు రక్షణ చర్యలు చేపట్టాలి

పామూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా సర్కిల్ పరిధిలో బాణసంచా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసినట్లు సీఐ ఎం.భీమానాయక్ తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బీ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన బాణసంచా విక్రయాల స్టాల్స్‌ను ఎస్ఐ టి.కిశోర్‌బాబుతో కలిసి శనివారం రాత్రి పరిశీలించారు. అనుమతులు లేకుండా లేకుండా బాణసంచా దుకాణాలు నిర్వహించడంగాని, అక్రమంగా నిల్వ చేయడంగాని చట్టపరంగా నేరమన్నారు. విక్రయ కేంద్రాలు, నిల్వ కేంద్రాలు నివాసాలకు దూరంగా ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

ముండ్లమూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా బాణసంచాను అనుమతి లేకుండా విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం ముండ్లమూరులో లైసెన్స్ పొందిన దుకాణాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణసంచా విక్రయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్ .శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం తనిఖీ

తాళ్లూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బీసీ బాలికల వసతి గృహాన్ని జిల్లా బీసీ సంక్షేమాధికారి దయాకర్ శనివారం ఆకస్మికంగా తనిఖీచేశారు. రికార్డులను పరిశీలించారు. గతకొంత కాలంగా మంచినీటి వాటర్ ప్లాంట్ పనిచేయక ఇబ్బందులు పడుతున్నట్టు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో మ్యాట్రిన్ తెరేజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

7

ఆదివారం 19 అక్టోబరు 2025





విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

సంస్థల సహకారంతో అభివృద్ధి

అద్దంకి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్ని పనులను ప్రభుత్వం చేయలేదని వివిధ సంస్థల సహకారంతో ఆయా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అసిస్ట్, నీడ్‌క్యాప్ సంస్థల సహకారంతో కాకానిపాలెం, గురకాయపాలెం జడ్పీహెచ్ఎస్‌లోని 356 మంది విద్యార్థులకు శనివారం అద్దంకిలోని కాకానిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌకర్యాలు లేక చదువు కోవడానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్నామన్నారు. ఇప్పటికే 3,456 మందికి సైకిళ్లను పంపిణీ చేశామని, పది వేల మందికి అందజేయడమే లక్ష్యమన్నారు. ఇప్పటికే 135 మంది దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలను అందించినట్లు తెలిపారు. ఫ్రాన్స్, నెదర్లాండ్‌లలో 50 శాతం మంది ఉద్యోగులు విధులకు సైకిళ్లపై వెళ్తున్నారని, మనం వాటిని పక్కన పడేస్తున్నామన్నారు. సైకిల్ అన్ని విధాలుగా ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ తరగతికి ఉపాధ్యాయుడు ఉండాలని డీఎస్సీ ద్వారా 16,300 పోస్టులను భర్తీ చేశామన్నారు. విద్యార్థులకు, రాజకీయాలతో సంబంధంలేదని అందువల్లే వారికి ఇచ్చే దుస్తులు, పుస్తకాలు, బ్యాగులపై రాజకీయ నాయకుల ఫొటోలు లేకుండా అందించామన్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు డయాలసిస్ సెంటర్, ఏఆర్‌టీ సెంటర్ మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో పురుషోత్తం, డిప్యూటీ డీఈవో గంగాధరరావు, హెచ్ఎం గురవయ్య, పీడీ విష్ణుప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఎంపీడీవో బి.వరూధిని, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, అద్దంకి, కొరిశపాడు తహసీల్దార్లు శ్రీచరణ్, జీవీ సుబ్బారెడ్డి, కాకాని అశోక్, ఎంఈవో-2 కేవీ శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.

సంస్థల సహకారంతో అభివృద్ధి

పత్తి.. పతనం



తెల్ల బంగారం.. సాగు చేసిన వారు మాత్రం తెల్లబోతున్నారు. పత్తిసాగు ఆరంభంలో వర్షాభావం.. ఆ తర్వాత అధిక వర్షాలు.. ఆపై తెగుళ్లతో పెట్టుబడులు పెరిగిపోయాయి. నీటి కష్టాలతో అధిగమించి.. తెగుళ్లను తప్పించుకుని.. పత్తి సాగు చేపట్టారు. వీడని వర్షాలు.. తెగుళ్లతో దిగుబడులు తగ్గిపోగా.. ధరలు అమాంతం పతనమయ్యాయి. ఒకవైపు భయపెడుతున్న వర్షాలు.. మరోవైపు నిల్వ సమస్యలతో రైతులు తీసిన పత్తిని తీసినట్లుగా అమ్ముకోవడంపై ఆసక్తి చూపుతున్నారు. ఇదే సమయంలో సీసీఐ కొనుగోళ్ల కేంద్రాల ప్రారంభానికి మరికొన్ని రోజులు గడువు ఉంది. ఇదే అవకాశంగా రైతుల నుంచి తక్కువ ధరకు వ్యాపారులు పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ఆశించనట్లుగా దిగుబడి లేక.. పెట్టిన పెట్టుబడి రాకపోవడంతో పత్తి రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

- దిగుబడి, ధర తగ్గుదల
- తెగనమ్ముకుంటున్న సాగుదారులు
- క్వింటాల్ రూ.4500 నుంచి రూ.5200 మాత్రమే

(పర్చూరు, ఆంధ్రజ్యోతి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో తెల్ల బంగారం తెల్లబోతుంది. సీజన్ ఆరంభంలోనే వ్యాపారులు పత్తి ధరను పాతాళంలో పడేశారు. ఏదో ఒక సాకు చెప్పి క్వింటాల్ పత్తిని రూ.4500 నుంచి రూ.5200 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఖరీఫ్ లో మొదటి పంటగా భావించే పత్తి ధర ఆరంభంలోనే అతితక్కువ స్థాయికి పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అధికంగా సాగయ్యే పంటల్లో పత్తి ఒకటి. ఈ ఏడాది గుంటూరు జిల్లాలో 59,140 ఎకరాల్లో, పల్నాడు జిల్లాలో 2,27,180 ఎకరాల్లో, బాపట్ల జిల్లాలో 4,585 ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. ఏటా సీసీఐ కొనుగోళ్ల ఆరంభం కావడం వల్ల పెద్దగా నష్టం (మిగతా 8లో)

పెట్టుబడి రూ.60 వేలు.. దిగుబడి అంతంతే

రైతులు పత్తి సాగు కోసం ఎకరాకు రూ.60 వేలు తగ్గకుండా పెట్టుబడి పెట్టారు. తొలకరి ఆరంభంలో కురిసిన వర్షాలకు మొక్కలు వేయగా, అప్పట్లో ఒక వారం, పది రోజులు తర్వాత కనుమరుగయ్యాయి. దీంతో చాలా పొలాల్లో మొక్కలు ఎక్కువగా చచ్చిపోయాయి. ఎర్ర తెగులు నివారణకు అధికంగా పురుగు మందులు వాడారు. దాంతో పెట్టుబడి రెండింతలైంది. ఇంత చేసినా ఎకరాకు 6 నుంచి 9 క్వింటాల్ మాత్రమే దిగుబడి వచ్చే పరిస్థితితో సాగుదారులు కన్నీటి పర్యంత మవుతున్నారు.



విస్తారంగా వర్షాలు.. ఎర్ర తెగులు

ఈ ఏడాది వర్షపాతం అధికంగా నమోదైంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పత్తి సాగు మొదలు పెట్టిన తర్వాత వర్షం ఎక్కువగా కురిసింది. దీంతో పంటను ఎర్ర తెగులు ఆశించింది. తెగులు నివారణకు రైతులు పలు రకాల మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. చాలా చోట్ల వర్షం నీళ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండటం వల్ల చేలు పూర్తిగా ఉరకెత్తాయి. ఇది రైతులకు తీవ్రంగా నష్టం చేకూర్చింది.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: ఆర్డీవో

రేపల్లె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్డీవో రామలక్ష్మీ అన్నారు. శనివారం పట్టణంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అంకమ్మ చెట్టు సెంటర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాకాలం కావటంతో వాతావరణంలో మార్పులు ఏర్పడ్డాయని, ప్రజలు కాచిచల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. అనంతరం మంత్రి అనగాని సోదరుడు శివప్రసాద్ మాట్లాడుతూ, అందరూ ఎప్పటి కప్పుడు చేతులు కడుక్కుని ఆహార పదార్థాలను తినాలని సూచించారు. పట్టణాన్ని స్వచ్ఛ రేపల్లెగా తీర్చిదిద్దేందుకు సమిష్టి కృషితో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, తహల్దార్ మోర్ల శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ టీవీకే గుప్తా, టీడీపీ పట్టణాధ్యక్షుడు మేకారామకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రిసార్ట్‌లో.. రేవ్ పార్టీ?

- తాగితూగిన.. మహిళలు.. పురుషులు
- పార్టీలతో కాసులు దండుకుంటున్న నిర్వాహకులు
- విషయం బహిర్గతం కావడంతో విచారణ చేపట్టిన పోలీసులు

- తాగితూగిన.. మహిళలు.. పురుషులు



చీరాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మసక మసక చీకటి.. హోరెత్తేలా సంగీతం.. మందుతో చిందు.. ఆడ మగ భేదం లేకుండా ఝుమరిచి నృత్యాలు.. ఇదేదో మెట్రోపాలిటిన్ నగరాల్లో పబ్‌లో అనుకుంటే పప్పులో కాలేసినట్లే. చీరాల ప్రాంతంలోని సముద్ర తీరంలోని ఓ రిసార్ట్ వేదికగా శృతి మించిన రేవ్ పార్టీ జరిగిన తీరిది. బుధవారం రాత్రి జరిగిన ఈ పార్టీ ఆలస్యంగా వెలుగుచూసింది. గతంలోనూ కొన్ని రిసార్ట్‌ల నిర్వాహకులు ఎదురుగా ఉండే సముద్రతీరంలో ఈవెంట్ల తరహాలో పార్టీలు నిర్వహించేవారు. అనుమతులు లేకుండానే ఆయా ఈవెంట్లను ఇష్టారీతిన నిర్వహించేవారు. కొన్నిసార్లు రహస్యంగా మందు పార్టీలు నిర్వహించేవారు. అయితే అప్పట్లో అధికారులు పట్టించుకోకపోవడంతో ఇటీవల రేవ్ తరహాలో పార్టీ శృతిమించినట్లు సమాచారం. తీరంలోని ఓ రిసార్ట్‌లో బుధవారం రాత్రి అట్టహాసంగా అసభ్యకరమైన పార్టీ నిర్వహించారని తెలిసింది. రంగు రంగుల విద్యుత్ దీప కాంతుల మధ్య మహిళలతో మద్యం సరఫరా చేయిస్తూ, చిందులు వేస్తూ పార్టీ నిర్వహించారని సమాచారం. వేరే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఈ పార్టీ నిర్వహించగా సుమారు 15 మంది మహిళలు, 20 మంది పురుషులు పాల్గొన్నట్లు సమాచారం. ఈ పార్టీలో ఆక్వా రంగానికి చెందిన ప్రముఖులు, వ్యాపారులు పాల్గొన్నట్లు ప్రచారం జరుగుతోంది అధికారుల నుంచి పక్కాగా అనుమతులు పొంది, నిబంధనల మేరకు మాత్రమే ఈవెంట్లు నిర్వహించాలి. కానీ నిర్వాహకులు మాత్రం పూర్తి నిబంధనలకు విరుద్ధంగా పార్టీలు నిర్వహించి కాసులు దండు కుని చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసు అధికారులకు ఈ అనధికార ఈవెంట్ల సమాచారం తెలిసినా పట్టించుకోవడంలేదని, అందువల్లే రిసార్ట్ నిర్వాహకులు పెట్రేగిపోతున్నారన్న విమర్శలు తీరప్రాంతవాసుల నుంచి వస్తున్నాయి. పర్యాటకుల ప్రాణాలకు బాధ్యత వహించలేని రిసార్ట్ నిర్వాహకులకు అనధికార పార్టీలపై ఆసక్తి చూపడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఆర్‌జడ్(కోస్టల్ రెగ్యులైజేషన్ జోన్) నిబంధనలు ఉల్లంఘిస్తూ తీరం రక్షణ దిబ్బలు చదును చేసుకుని క్యాంపు ఫైర్‌లు వేసి ఆదాయం దండుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

పోలీసులు విచారణ

ఇదిలా ఉంటే బుధవారం రాత్రి తీరంలోని ఓ రిసార్ట్‌లో జరిగిన రేవ్ పార్టీ నిర్వహణకు సంబంధించి కొందరు పోలీసులకు సమాచారం ఉన్నట్లు తెలిసింది. అయినా వారు పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. ఈ పార్టీ శృతిమించిపోవడంతో ఆ నోటా, ఆ నోటా తాజాగా వెలుగుచూసింది. దీంతో ఈ పార్టీపై విచారణకు ఉన్నత స్థాయి అధికారులు సిద్ధమయ్యారని సమాచారం. అయితే నిర్వాహకులు అధికారులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతిమంగా ఈ రేవ్ పార్టీ కథ ఎలా ముగుస్తుందో చూడాలి.

నిబంధనలు అనుసరించాలి

ప్రభుత్వ నిబంధనలు అనుసరించి మాత్రమే ఈవెంట్లు నిర్వహించాలి. ముందస్తు చేసుకున్న అర్జీ ప్రకారం మద్యం సరఫరా జరుగుతుంది. గత శుక్రవారం రెండు రిసార్ట్‌లు వారు ఈవెంట్లకు అనుమతులు కోరారు. మార్గదర్శకాలను సూచించి వారికి అనుమతులు ఇచ్చాం. నిర్వాహకులు నిబంధనలకు భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయి.

-నాగేశ్వరరావు, ఎక్సైజ్ సీఐ

ఆక్వా సాగుకు లైసెన్సులు పొందాలి

- మత్స్యశాఖ సమీక్షలో కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆక్వా సాగు చేసేవారు తప్పనిసరిగా లైసెన్స్‌లు పొందాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో మత్స్యశాఖాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్‌లు కావాల్సిన వారు సచివాలయంలో స్వయంగా లేదా డిజిటల్ అసిస్టెంట్ ద్వారా ఈ-మత్స్యకార్ వెబ్ పోర్టల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఆక్వాకల్చర్ అభివృద్ధికి జిల్లా, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసైన్డ్‌భూముల్లో ఆక్వా సాగు చేసేవారి వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. జిల్లాలో 9,579.44 హెక్టార్లలో ఆక్వా సాగు అవుతుందని అందులో 6,257.59 హెక్టార్‌లకు మాత్రమే రిజిస్ట్రేషన్ ఉందన్నారు. ఆక్వా సాగు భూమి రిజిస్ట్రేషన్‌కు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో మత్స్యశాఖ డీడీ గాలిదేవుడు, జేడీ శ్రీనివాస్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన కల్పించాలి

జీఎస్టీ తగ్గింపుతో తగ్గిన వస్తువుల ధరలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. షాపింగ్ సండడి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

కార్యక్రమాలపై శనివారం వాణిజ్య పన్నులశాఖాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ దుకాణంలో వస్తువుల ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు.

118 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో 118 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతీ కేంద్రంలో గోనెసంచులతో పాటు తేమశాతం పరిశీలించే యంత్రాలు ఉండాలన్నారు. ధాన్యం కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ, వార్డుసచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు పొందడంలో జిల్లా రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. ఆక్వాచెరువులకు అమలు చేస్తున్న విద్యుత్ రాయితీని మరింత విస్తరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ సమావేశంలో మత్స్యాశాఖాధికారి శ్రీనివాస్‌నాయక్, గాలిదేముడు, డీఈవో ఎస్.పురుషోత్తం, వ్యవసాయశాఖ డీడీ అన్నపూర్ణ, కలెక్టరేట్ ఏవో మల్లి కార్జునరావు, సచివాలయాల కోఆర్డినేటర్ పి.యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

- కార్పస్ ఫండ్ పంపిణీలో ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలీసు కుటుంబాలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన జేపంగులూరు పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ పి.వెంకటస్వామి సతీమణి హేమలతకు శనివారం ఎస్పీ అడిషనల్ కార్పస్ ఫండ్ రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీపీవో బీ సెక్షన్ సూపరింటెండెంట్ కె.రాధ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ బీ ఉమామహేశ్వర్

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ర్యాలీలో మంత్రి గొట్టిపాటి



స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ వినోద్‌కుమార్, అధికారులు, విద్యార్థులు

మేదరమెట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటితో పాటు పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. శనివారం మేదరమెట్లలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. తొలుత మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత అంశంపై విద్యార్థులు, గ్రామస్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించి స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఇంట్లో చెత్తను తెచ్చి కాల్వలో వేయరాదని ప్రజలకు సూచించారు. గ్రామంలో తడి, పొడిచెత్తలను విడివిడిగా సేకరించాలన్నారు. ఇప్పటికే రూ.80 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణం జరిగిందని, మరో కోటి మంజూరయ్యాయన్నారు. రూ.3 కోట్లతో ఇంటింటికి తాగునీరు అందించే జలజీవన్ మిషన్ పనులు చివరి దశకు చేరాయన్నారు. అనంతరం వర్మీ కంపోస్టు కేంద్రాన్ని మంత్రి పరిశీలించారు. మేదరమెట్ల, అద్దంకిలలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్‌పై అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ వినోద్‌కుమార్, ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో విజయమ్మ, అటవీశాఖాధికారి రవిశంకర్, డీఆర్‌డీఏ పీడీ లవన్న, డీఎల్‌పీవో శివన్నారాయణ, ఏపీడీ సింగయ్య, డీఎస్పీ మొయిన్, జడ్పీటీసీ వెంకటరమణ, ఎంపీపీ ప్రసన్నకుమారి, సర్పంచ్ బొనిగల ఎలిశమ్మ, తహసీల్దార్ సుబ్బారెడ్డి, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, సీఐ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

వామ్మో.. ప్రత్యేక రైళ్లు



- భయపడుతున్న ప్రయాణికులు
- ఈ రైళ్లలో ఆదరణ, భద్రత రెండూ తక్కువే
- షెడ్యూల్ సమయానికి ప్రయాణించని వైనం
- గంటల తరబడి జాప్యంతో ప్రయాణికులకు నరకం

బాపట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రద్దీ రోజుల్లో ఒకప్పుడు ప్రత్యేక రైళ్లను రైల్వే శాఖ ఎప్పుడు ప్రకటిస్తుందా అని ప్రయాణికులు ఎదురు చూసే వాళ్లు. ఎప్పుడు వస్తాయో.. ఎప్పుడు గమ్యస్థానానికి చేరుతాయో తెలియక.. కనీస సౌకర్యా లను పట్టించుకునే వారు లేక.. నేడు స్పెషల్ ట్రైన్స్ అంటేనే భయపడి పోతున్నారు. సమయపాలన అనేది ఈ రైళ్లకు కనీసం 10 శాతం కూడా ఉండదు. ఈ కార ణంగా స్లీప ర్‌క్లాస్/ఏసీ తరగతుల్లో అరకొరగానే ప్రయా ణికులు టిక్కెట్లు రిజర్వు చేసుకుంటున్నారు. స్పెషల్ ట్రైన్స్ గురించి తగిన సమాచారం ఉండకపోవడంతో జనరల్ బోగీల్లో ఎవరూ పెద్దగా ప్రయాణించడం లేదు. దీంతో ప్రయాణికుల్లో ముఖ్యంగా మహిళల భద్రతకు గ్యారెంటీ లేకుండా పోతోంది. రైల్వే నిబంధనల ప్రకారం ఏదైనా మార్గంలో లైన్ కెపాసిటీ 100 శాతం మించ కూడదు. అయితే గుంటూరు రైల్వే డివిజన్‌లోని నంద్యాల, నడికుడి మార్గాల్లో ఇంతకు మించి రైళ్లు/గూడ్స్‌లు ప్రయాణిస్తున్నాయి. దీనికి కారణం ప్రత్యేక రైళ్లను నడుపుతుండటమే. ఏదైనా స్పెషల్ ట్రైన్ ప్రకటించేటప్పుడు పాత్ చూసుకోవాలి. ఏ సమయానికి ఆ రైలు ఏ స్టేషన్‌కు వెళ్లాలి అనేదే పాత్. ఆ ప్రకారమే నడిపితే ఎలాంటి ఇబ్బంది ఉండదు. అయితే పాత్ నిబంధన పాటించకుండా రైళ్లను నడుపు తున్నారు. దీంతో సింగిల్ లేన్ రూట్‌లో అయితే క్రాసింగ్/ప్రిసిడెన్స్ కోసం స్పెషల్స్‌ని లూప్‌లైన్‌లో పెడతారు. డబుల్ లేన్ మార్గాల్లో రెగ్యులర్ రైళ్లకు ప్రిసిడెన్స్ ఇచ్చి స్పెషల్ ట్రైన్‌ని లూప్‌లో పెట్టి పంపుతారు. ఈ కారణంగా గంటల తరబడి ప్రత్యేక రైళ్లు ఆలస్యమౌతాయి. ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చే రైళ్లు అయితే కొన్ని సందర్భాల్లో 12 గంటలకు పైగా ఆలస్యమౌతున్న దాఖలాలు ఉన్నాయి.

చార్జీ అధికమైన ప్రాధాన్యం తక్కువ

ఈ స్పెషల్ రైళ్లలో చార్జీలు కూడా ఎక్కువే. తత్కాల్ టిక్కెట్ చార్జీకి సమానంగా ధర ఉంటుంది. అయినా రాకపోకల్లో రెగ్యులర్ రైళ్లకు ఇచ్చినంత ప్రాధాన్యం వీటికి ఇవ్వడంలేదు. ఎప్పుడు వస్తాయో.. ఎప్పుడు కదులుతాయో కూడా తెలియక ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటారు. కొన్ని రైళ్లలో అయితే ఫ్యాన్లు తిరగవు.. మరుగుదొడ్లలో నీళ్లు కూడా ఉండవు. అరకొర సౌకర్యాల మధ్య ప్రయాణికులు గోడు ఎవరూ పట్టించు కోరు. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో, అత్యవసరమైన వాళ్లు మాత్రమే మరో ప్రత్యామ్నాయం లేక వీటిల్లో టిక్కెట్లు బుకింగ్ చేసుకుంటారు. ఏ ప్రత్యేక రైలులోనైనా జనరల్ బోగీలు ఖాళీగా ఉంటాయి. వీటి గురించి సమాచారం లేకపోవ డం, ఆలస్యంగా ప్రయాణిస్తుండటం ప్రధాన కారణాలు. ఇదే అదనుగా మహిళలు/సీనియర్ సిటిజన్స్ బోగీలో పురుషులు ఎక్కేస్తున్నారు. దీనిని అడ్డుకోవాల్సిన ఆర్‌పీఎఫ్, సెక్యూరిటీ విభాగం సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఏదైనా సంఘటన జరిగిన తర్వాత కొన్ని రోజులు హడావిడి చేయడం ఆ తర్వాత పట్టించుకోకపోవడం చేస్తున్నారు. ఈ నెల 13న సంత్రగచి స్పెషల్ మహిళల బోగీలో పురుషుడు చివరి నిమిషంలో ఎక్కుతుండటాన్ని గార్డు గమనించారని రైల్వే అధికారులు చెబుతున్నారు. అలాంటప్పుడు గార్డు వైర్‌లెస్ సెట్‌లో లోకోపైలట్‌కు చెప్పి రైలుని ఆపి తగిన చర్యలు తీసుకోవాలి. అలా చేయకుండా ఆ ప్రయాణికుడు కింద పడిపోతాడని రైలుని ఆపలేదని చెబుతుండటం ఎంతవరకు సమంజసమో అధికారులు చెప్పాలి. చిన్న తప్పిదం వల్ల ఒక ప్రయాణికురాలు అత్యాచారం, దోపిడీకి గురయ్యారు. దీనికి ఎవరిని బాధ్యులను చేస్తారో చూడాలి.

అవీ..ఇవీ..

లక్ష్యంపై దృష్టిసారిస్తేనే విజయం

● ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి వాహిని



సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి వాహిని

చీరాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్యాలపై దృష్టి సారించి విజయాలు అందుకోవాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఏవీ వాహినీ అన్నారు. శనివారం స్థానిక గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ఆధారంగా గురుకుల పాఠశాలల రూపొందినట్లు చెప్పారు. హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్యలక్ష్మీ, న్యాయవాదులు స్నేహ, ప్రిన్సిపల్ మాధవీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యం ప్రజాసేవలో పారిశుధ్య కార్మికులు

గాంధీనగర్(చీరాల), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎండా, వాన లేకుండా పారిశుధ్య కార్మికులు ప్రజాసేవలో ఉంటారని డిప్యూటీ ఎంపీడీవో అచ్చుకోల రామకృష్ణ అన్నారు. గాంధీనగర్ పంచాయతీ కార్యదర్శి నక్కల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులకు దీపావళి పర్వదినాన్ని పురస్కరించకుని నిత్యావసరాలు, క్రాకర్స్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్విరామంగా శ్రమిస్తున్న కార్మికులకు సహకారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు రాజేష్, కార్యాలయం సిబ్బంది ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే



నృత్య ప్రదర్శనల్లో విద్యార్థినులు

చీరాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వైప మహిళ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మురళీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథులుగా సబ్ ట్రెజరీ అధికారి రమణారెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ స్నేహలత, సీపీడీసీ సభ్యులు శేషు మాధవీ, ఎస్సై రాజ్యలక్ష్మీ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల నృత్యప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రత్నపాప, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాలకు సౌకర్యాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

● మంత్రి గొట్టిపాటి రవికుమార్


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి రవికుమర్

మేదరమెట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. శనివారం మేదరమెట్ల నుంచి తమ్మవరం వరకు రూ.1.44 కోట్లతో నిర్మించిన తారురోడ్డు ప్రారంబోత్సవానికి మంత్రి రవికుమార్, బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రారంబోత్సవ శి లా ఫలఫకలను ఆవిష్కరించిన అనంతరం మంత్రి రవికుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్లుకు కనీస మరమ్మతులు చేపట్టలేదన్నారు. కూటమీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా గ్రామీణ రహదారులపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎక్కుగా దెబ్బతిన్న రోడ్ల పునర్నిర్మాణం, స్వల్పంగా దెబ్బతిన్న రోడ్లుకు మరమత్తులు చేపట్టామన్నారు. కొత్తరోడ్ల నిర్మాణంతో నిత్యం ఉపాధి కోసం బయటకి వెళ్లే వారితో పాటు రైతులకు చుట్టు పక్కల ఉన్న పరిశ్రమలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంద న్నారు. అనంతరం గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సైడ్ కాలువలు నిర్మాణానికి , జలజీవన్ మిషన్ లకు మంజూరైన నిధులు చాలక పోతే అధనంగా ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, ఎంపీడీవో రాజ్యాలక్ష్మి, ఇతర అధికారులు, తెలుగుదేశం నాయకులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పార్వతీపురం చెరువుకు చేరిన సాగర్ జలాలు

జలహారతి ఇచ్చిన గ్రామస్థులు

అద్దంకి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్వతీపురం చెరువుకు సాగర్ జలాలు చేరాయి. దీంతో గ్రామస్థులు జలహారతి ఇచ్చారు. మోదేపల్లి మేజర్ చివరి ఆయకట్టులోని కొటికలపూడి పంచాయతీ పరిధిలోని పార్వతీపురం చెరువుకు నీరు రావడం గగనంగా మారింది. ఈ నేపథ్యంలో కొటికలపూడి సర్పంచ్ పూనాటి విక్రమ్ రూ.లక్ష సొంత నిధులు వెచ్చించి 5 రోజులుగా ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేసి సాగర్ కాలువలలో జంగిల్ క్లియరెన్స్ చేయించారు. దీంతో శనివారం సాయంత్రానికి సాగర్ జలాలు పార్వతీపురం చెరువుకు చేరాయి. దీంతో పార్వతీపురం, వేణుగోపాల పురం గ్రామాలకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి. పశువుల నీటికి కూడా ఇబ్బందులు తొలగిపోనున్నాయి. సాగర్ జలాలు చెరువుకు చేరడంతో సర్పంచ్ పూనాటి విక్రమ్ ఆధ్వర్యంలో మహిళలు పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. సాగర్ జలాలు చెరువకు చేరడంతో పార్వతీపురం, కొటికలపూడి గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


జలహారతి ఇస్తున్న మహిళలు

జీఎస్‌టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి వర్గాలకు మేలు

మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్

పర్చూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సూపర్ జీఎస్‌టీతో పేద, మధ్య తరగతి కుటుంబాల్లో కొనుగోలు శక్తి పెరిగిందని, దీని వల్ల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహద పడునుందని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన పర్చూరులో జీఎస్టీపై మోటార్ వెహికల్ అధికారులు ఆయా శాఖలతో కలసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆర్‌టీసీ బస్టాండ్ నుంచి బొమ్మల కూడలి వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రవినాయక్ మాట్లాడుతూ చిన్న తరహా వాహనాలపై ప్రభుత్వం జీఎస్టీ 28 శాతం నుండి 18 శాతానికి తగ్గించిందన్నారు. అనంతరం ఎంపీడీవో ప్రద్యుమ్న కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ప్రతిఫలాలు ప్రజలకు అర్థమయ్యేలా వివరించేందుకు పెద్దఎత్తున అవగాహన ర్యాలీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



పర్చూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంవీఐ రవికుమార్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యం

- కోనంకిలోని వ్యవసాయ బావి వద్ద ఘటన
- మృతదేహం నడుముకు కట్టి ఉన్న రాయి

మార్టూరు, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో కోనంకి రెవెన్యూ పరిధిలోని ఓ వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహన్ని శనివారం పోలీసులు గుర్తించారు. ఇసుకదర్శి నుంచి వలపర్ల గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డులో కోనంకి రెవెన్యూ పరిధిలోని బావిలో నీటిపై మృతదేహం తేలాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఘటనా స్థలానికి ఎస్ఐ సైదా పోలీసు సిబ్బందితో వెళ్లి బావిలో నుంచి మృతదేహన్ని పోలీసులు బయటకు తీయించారు. మృతదేహం రెండు కాళ్లకు కలిపి తాడుతో ఒక బండరాయిని, అదేవిదంగా మృతదేహనికి నడుముకు తాడుతో మరో బండరాయిని కట్టి ఉండడంతో పోలీసులు షాక్‌కు గురయ్యారు. మృతునికి 50 నుండి 55 ఏళ్ల ఉండవచ్చు. మృతదేహం పూర్తిగా కుల్లి ఉండటంతో మృతదేహన్ని బావి నుండి బయటకు తీయించడానికి పోలీసులు ఎంతో కష్టపడ్డారు. అదేవిధంగా మృతుని శరీరంపై కుడిచేతికి కాశీదారం, ఎర్రరంగుతో ఉన్న శివుని బొమ్మతో పూసలదారం, హాఫ్ హ్యాండ్ తెల్ల చొక్కా, బొంబే డయింగ్ లుంగీ ఉన్నాయి. కాని మృతదేహంపై ఎలాంటి గాయాలు లేకపోవడం విశేషం. తరువాత సీఐ యం శేషగిరిరావు సిబ్బందితో ఘటన జరిగిన బావి వద్దకు వచ్చి పరిశీలించారు. కోనంకి వీఆర్‌వో గుమ్మడి నాగు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి మృతదేహన్ని మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీ గదికి తరలించారు. ఇదిలా ఉండగా మృతునిని ఎవరైనా హత్య చేసి బావిలో పడవేశారా..? మృతదేహం బయటకు నీటిలో తేలకుండా ఉండేవిదంగా బండరాళ్ల కట్టారా...? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అనుమానాస్పదమృతిగా కేసు నమోదు

ప్రభుత్వ ఆస్పత్రి లోని మార్చురీ గదిలోని వ్యక్తి మృతదేహన్ని బాపట్ల డీఎస్పీ జి రామాంజనేయులు పరిశీలించారు. మృతదేహం బావిలో ఉన్న తీరుపై సీఐ ఎం శేషగిరిరావును వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుని ఆ చూకీ కోసం పోలీసులు నిరంతరం పనిచేస్తున్నట్లు తెలిపారు.


బావిలో తేలుతున్న మృతదేహం

పర్యాటకుల రక్షణకు జాగ్రత్తలు పాటించండి

● అన్ని ప్రభుత్వ విభాగాలతో ఎమ్మెల్యే కొండయ్య సమీక్ష
● కార్తీక మాసం పుణ్య స్నానాలపై పలు సూచనలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

రామాపురం (చీరాల), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : తీరానికి విచ్చేసే పర్యాట కుల రక్షణపై ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే కొండయ్య సూచించారు. శనివారం రాత్రి ఆర్డీవో చంద్ర శేఖర్ నాయుడు, డీఎస్పీ ఎండీ మొయిన్‌లతో తీరంలోని ఓ రిసార్ట్‌లో అన్ని ప్రభుత్వ విభాగ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కార్తీక మాసంకు సంబంధించి పుణ్య స్నానాలు ఆచరించే భక్తుల సంఖ్య అధికంగా ఉంటే అవకాశం ఉన్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. పోలీసుల పర్యవేక్షణతో పాటు గజ ఈతగాళ్ల కదలికలపై ప్రత్యేకంగా చర్చించారు. అంతకుముందు పట్టణంలో పురపాలక సంఘం, జీఎస్‌డబ్ల్యూఎస్ సంయుక్తంగా ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు, అధికారులు, పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమన్వయంతో ఉత్తమ బోధన

బల్లికురవ, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఉపాధ్యాయులతో సమన్వయంతో ముందుకు వెళితే ఉత్తమ బోధన అందుతుందని ఎంఈవో శ్రీనివాసరావు అన్నారు. మండలం పరిధిలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల సమన్వయం శ్రేయస్సుపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కెరీర్ మానసిక ఆరోగ్య కౌన్సిలర్లు జి.నాగలక్ష్మీ, వేణుగోపాలరావులు విద్యార్థులకు వారి చదువులో తీసుకోవాల్సిన జాగ్రత్తపై కౌన్సిలింగ్ చేశారు. మానసిక ఒత్తిడికిలోనూ కాకుండా విద్యార్థులు ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరళాకుమారి తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

అద్దంకి,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులకు అద్దంకి కోర్టులో జరిమానా విధించారు. అద్దంకి పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యంసేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ నలుగురు వ్యక్తులను శనివారం కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి అఖిల ఒకరికి రూ.4వేలు, మిగిలిన ముగ్గురికి రూ.3 వేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. పెంపరాల వద్ద పేకాట ఆడుతూ పట్టుబడ్డ వ్యక్తులకు ఒక్కొక్కరికీ రూ. 300 రూపాయలు చొప్పున న్యాయాధికారి అఖిల జరిమానా విధించినట్లు తెలిపారు.

27న ఇంకొల్లులో శనగరైతుల సదస్సు

ఇంకొల్లు, అక్టోబరు 18,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లులో ఈ నెల 27న శనగరైతుల సమస్యలపై సదస్సు నిర్వహించనున్నట్లు రైతుసంఘం జిల్లా కార్యదర్శి తల్లపనేని రామారావు తెలిపారు. నవంబరు 5న మండల రైతు మహాసభ, నవంబరు 15వ తేదిన జిల్లా రైతు మహాసభలు ఇంకొల్లులో నిర్వహించనున్నట్లు శనివారం జరిగిన సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా రైతుసంఘం ఉపాధ్యక్షులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, అన్నెం ఆదెయ్య, బాచిన కోటేశ్వరరావు, సుబ్బారావు, హనుమంతరావు, గోవిందరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో సృజనాత్మకత పెంపు


ప్రశ్నాపత్రాలను ఆవిష్కరిస్తున్న పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు

చినగంజాం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తమ సృజనాత్మకతను చాటుకునేందుకు పోటీపరీక్షలు దోహదపడతాయని పాఠశాల హెచ్ఎం కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు ఎస్.నరసింహారావులు అన్నారు. జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 'చెకుముకి సైన్స్ సంబరాలు- 2025' సందర్భంగా ప్రతిభ పరీక్ష నిర్వహించారు. మండల పరిధిలోని పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు 130 మంది చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు హాజరైనట్లు నరసింహారావు కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు ప్రసాద్‌రావు, ఉదయబానేశ్వరి, అరుణ, ఉపాధ్యాయులు శ్రీలక్ష్మి, కుమార్, నాగేశ్వరరావు, అంకమ్మ, కోటిరెడ్డిలు పాల్గొన్నారు.

చెకుముకి పరీక్షకు 400 మంది హాజరు

ఇంకొల్లు, అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి) : జనవిజ్ఞాన వేదిక యూటీఎఫ్ వారు సంయుక్తంగా నిర్వహించిన చెకుముకి సైన్సు ప్రతిభా పరీక్షకు 400 మంది విద్యార్థులు హాజరైనట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చెంచయ్య తెలిపారు. ఇంకొల్లు మండలంలోని 8 పాఠశాలలో శనివారం 8, 9, 10 తరగతులకు పాఠశాల స్థాయిలో విద్యార్థులకు చెకుముకి పరీక్ష నిర్వహించగా 400 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. వీరిలో ప్రథమస్థానం పొందిన వారు నవంబరు 1న మండలస్థాయిలో జరిగే పరీక్షకు అర్హులని మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు పి.సత్యనారాయణ, మస్తాన్‌వలి తెలిపారు.

కల్యాణ మండపం అభివృద్ధికి విరాళం

చీరాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్‌వీఎస్ అండ్ ఎస్‌జేఆర్ ఆర్యవైశ్య కల్యాణ మండపం ఆధునీకరణ పనులకు వాకర్స్ అసోసాయేషన్ సభ్యులు తవ్వా రామకృష్ణ రూ.1,01,116 భారీ విరాళం అందజేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రతినిధులు రామకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, గురుప్రసాద్, నారాయణమూర్తి, వలివేటి మురళీకృష్ణ, చెంగలరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధికి చర్యలు

● మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు


భూమిపూజ చేస్తున్న చైర్మన్ సాంబశివరావు

చీరాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : వార్డుల్లో డ్రెయినేజీ వ్యవస్థను గాడిలోకి తెచ్చి అభివృద్ధికి సంబంధించి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు చెప్పారు. శనివారం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 7వ వార్డులో రూ.17 లక్షలతో, అలాగే 31వ వార్డులో రూ.35 లక్షలకు సంబంధించిన డ్రెయినేజీ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఎమ్మెల్యే కొండయ్య మార్గదర్శకాలతో అభివృద్ధే లక్ష్యంగా సాగుతున్నట్లు చైర్మన్ వివరించారు. ఆయన వెంట డిఈఈ రఘురామ్, ఏఈ రవికుమార్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

● అప్పలబాధతో ఆత్మహత్యాయత్నం

యద్దనపూడి,(మార్టూరు)అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో కౌలు రైతు శుక్రవారం ఆత్మహత్యకు యత్నించగా, చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చింతపల్లిపాడు గ్రామానికి చెందిన బత్తుల చిట్టిబాబు (46) కౌలు రైతుకు ఆయన భార్య 2015లో చనిపోయింది. ఆయనకు ఇద్దరు కుమారులున్నారు. కౌలుకు పొలం సాగు చేస్తూ వ్యవసాయంలో అప్పుల పాలయ్యాడు. ఈ క్రమంలోనే శుక్రవారం మధ్యాహ్నం ఇంటి వద్ద పురుగుమందు తాగాడు. విషయాన్ని గమనించిన రమేష్ అనే వ్యక్తి ఆయన్ను చిలకలూరిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి.రత్నకుమారి తెలిపారు.



పేపర్ లారీ కంటైనర్‌లో అగ్నిప్రమాదం

● జాతీయ రహదారిపై రాజుపాలెం వద్ద ఘటన


డివైడర్‌పై ఉంచిన కంటెనర్

మార్టూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుండి మంగళగిరి వెళుతున్న లారీ కంటైనర్‌లో అగ్నిప్రమాదం సంబవించిన ఘటన శనివారం జాతీయ రహదారిపై మండలంలోని రాజుపాలెం సమీపంలో చోటుచేసుకొంది. కంటైనర్ లారీ ముందు టైరు పగలడంతో అదుపుతప్పి రోడ్డు మధ్యలోని డివైడర్ ఎక్కింది. దీంతో లారీకి చెందిన డీజిల్ ట్యాంక్ పగిలి క్యాబిన్‌లోని మంటలు వ్యాపించాయి. దీంతో లారీ క్యాబిన్‌భాగం పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో లారీ డ్రైవరు క్షేమంగా బయటపడ్డారు. రహదారిపై ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు రేగడంతో ప్రయాణికులు రాకపోకలకు కొంతసేపు ఆటంకం కలిగింది. ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే సీఐ ఎం.శేషగిరిరావు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి ట్రాఫిక్ సరిచేయించారు. చిలకలూరిపేట నుంచి ఫైరింజన్ మంటలను అదుపు చేసింది.

పేపర్ బండిళ్లకు అంటుకున్న మంటలు

కంటైనర్‌లో తేలికగా మండే స్వభావం ఉన్న పేపర్ బండిళ్ల ఉండడంతో మంటలకు అవి కొంత భాగం అంటుకున్నాయి. దీంతో పోలీసులు ఫైరింజన్ కంటెయినర్ వద్దే ఉండేలా చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా రోడ్డు డివైడర్ మధ్యలో ఉన్న కంటెయినర్ ను తొలగించడానికి ఆదివారం ఉదయం దాకా వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కంటైనర్‌కు సంబంధించిన వ్యక్తులు వచ్చిన తర్వాత తలుపులు తీసే వీలుంటుందని పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని బాపట్ల డీఎస్పీ జి రామాంజనేయులు శనివారం రాత్రి పరిశీలించారు. లారీ నుండి మంటలు వ్యాపించిన తరువాత పోలీసులు, అగ్నిమాపకసిబ్బంది తక్షణమే స్పందించి పరిస్థితిని అదుపులోనికి తీసుకురావడం అభినందనీయమన్నారు.

పత్తి.. పతనం

(5వ పేజీ తరువాయి)

ఉండదన్న భావనతో ఎక్కువ గానే పత్తి సాగు చేస్తున్నారు. అయితే ఈ ఏడాది అధిక వర్షపాతం వల్ల రైతులు అంచనాలు తల్లకిందులు అవుతున్నాయి. వర్షం ఎక్కువగా కురవడం పత్తికి శాపంగా మారింది. నెమ్ము ఎక్కువగా ఉందని వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. పల్నాడు జిల్లాలో పత్తి అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో తీసిన పత్తిని తీసినట్లు అమ్మాల్సిన పరిస్థితి నెలకొంది. రేపోమాపో సీసీఐ కేంద్రాలు తెరిచే అవకాశం ఉన్నా పెట్టుబడి పెట్టిన వ్యాపారులు ఒత్తిడితో రైతులు తెల్ల బంగారాన్ని తెగనమ్ముకుంటున్నారు.

సీసీఐతోనే.. మద్దతు

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొనుగోలు కేంద్రాలు ఈ నెల 21 నుంచి తెరుస్తామని చెబుతుంది. ఈ ఏడాది సీసీఐ పత్తి క్వింటాల్ ధర మొదటి శ్రేణి రూ.8,110, దిగువ శ్రేణికి రూ.7,710 వరకు మద్దతు ధర గా నిర్ణయించారు. అయితే పత్తి తీతలు మొదలు పెట్టి రైతులు నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడం.. అడపాదడపా వర్షాలతో తీసిన పత్తిని తీసినట్లు విక్రయిస్తున్నారు. ఇదే అవకాశంగా రైతులు ధరలు తగ్గించి ఇష్టారీతిన కొనుగోలు చేస్తుండగా తప్పనిసరి పరిస్థితుల్లో సాగుదారులు అమ్ముకుంటున్నారు. సీసీఐ కేంద్రాలు తెరిస్తే వ్యాపారులు కూడా కొంత మేరకు ధరలు పెంచి కొనుగోలు చేసే అవకాశం ఉంది.

కేజీబీవీలో మండల ప్రత్యేకాధికారి తనిఖీ


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు


బల్లికురవ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుంటుపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జూనియర్ కళాశాలను జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్, మండల ప్రత్యేకాధికారి బి. వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యాలయంలో విద్యార్థినులకు అందుతున్న వసతుల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన తరగతి గదులతో పాటు వసతులను మెరుగు పరిచేలా నివేదికలను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. అనంతరం ఆయన విద్యార్థినులతో కలిసి భోజనం చేసి వారికి ప్రతి రోజు మోను ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఈ తనిఖీలో ఎంపీడీవో కుసుమకుమారి, ఎంఈవో శ్రీనివాసరావు, విద్యాలయ ప్రిన్సిపాల్ సరళకుమారి టీడీపీ నాయకులు మలినేని గోవిందరావు పాల్గొన్నారు.

జామియా మసీద్ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు

అద్దంకి,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉత్తర అద్దంకి రెవెన్యూ పరిధిలో 1042 సర్వేనంబరులో జామియా మసీదుకు 29 సెంట్లు స్థలం ఉందని, స్థలాల ధరలు పెరిగిన నేపథ్యంలో పలువురు ఆక్రమించుకొని అమ్ముకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. 'మస్జిద్-ఇ-జామియా డెవలెప్‌మెంట్ కమిటీ ' అధ్యక్షుడు షేక్ ఇమాంసాహెబ్, షేక్ అబ్దుల్ మాలిక్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అమ్మే ప్రయత్నించిన వ్యక్తులు, కొనుగోలు చేసే వ్యక్తులపై వక్ఫ్ సవరణ చట్టాని అనుసరించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పాతకక్షల నేపథ్యంలో పరస్పర దాడులు

పందిళ్లపల్లి(చీరాల), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పందిళ్లపల్లి గ్రామంలో శనివారం పాతకక్షల నేపథ్యంలో పరస్పర దాడులు జరిగాయి. అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.., గ్రామంలోని వేణుగోపాలస్వామి గుడి సమీపంలోని గ్రంధి శివనాగేంద్రబాబు, రామాంజనేయులు అన్నదమ్ములు. వీరికి అదే ప్రాంతానికి చెందిన కోలా వెంకటేశ్వర్లుతో కొంతకాలంగా వివాదం ఉంది. ఈ క్రమంలోనే శనివారం చిల్లచెట్ల కొమ్మల వ్యవహారంలో వివాదం చోటుచేసుకొంది. దీంతో జరిగిన ఘర్షణలో అన్నదమ్ములు ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. మరోవర్గానికి చెందిన వ్యక్తికి స్వల్పంగా గాయపడ్డాడు. అయితే ఇరువురు కత్తులతో దాడులు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.



కలెక్టరు సైకిల్ సవారీ !

- వాహన కాలుష్య నివారణకు వినూత్న ప్రయత్నం
- నాణ్యమైన గాలి కావాలంటే మొక్కలు నాటాలి : హిమాన్షు శుక్లా



నెల్లూరు(సిటీ),అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ దాటితే ఎక్కడికైనా కారులోనే వెళ్లే కలెక్టర్ హిమాన్షు శుక్లా శనివారం సైకిలెక్కారు. ఎక్కడమే కాదండోయ్... నెల్లూరు నగరంలోని బట్వాడీపాళెం నుంచి సారాయి అంగడి సెంటర్ వరకు సైకిలు తొక్కుకుంటూ వెళ్లారు. మాటలు చెప్పడం కాదు... వాటిని ఆచరించి చూపించారాయన. ఇంతకు విషయం ఏమిటంటే.. ప్రతినెలా మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆయన సైకిలెక్కారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాహన కాలుష్యాన్ని నివారించేందుకు సైకిలే ప్రత్యామ్నాయమన్నారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో మొక్కలు నాటారు. అక్కడ మాట్లాడుతూ ఈసారి స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో క్లీన్ ఎయిర్ థీమ్ తీసుకున్నామన్నారు. పర్యావరణం బాగుంటేనే నాణ్యమైన గాలి అందుబాటులో ఉంటుందని, ఇందుకోసం మొక్కలను పెంచడమే మార్గమని తెలిపారు. మంచి వర్షాలు పడుతున్నందున అందరూ విధిగా ఒక మొక్కను నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్, డీడీ మాధురి, డీసీ చెన్నుడు, ఎంహెచ్‌వో డాక్టర్ కనకాద్రి, తదితర అధికారులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లలో స్వచ్ఛాంధ్ర

నెల్లూరు(క్రైం), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్నీ పోలీసు స్టేషన్ల లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. శుభ్రమైన గాలి అనే అంశంపై జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఎస్బీ సీఐ శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ వెల్ఫేర్ రాజారావు, హోంగార్డు ఆర్ఐ పాల్‌రాజ్, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఎస్పీ సౌజన్య

వెలుగులు నింపేనా..?

- నగరంలోని ఆరుచోట్ల బాణసంచా దుకాణాల ఏర్పాటు
- టపాసుల అంగళ్ల ఏర్పాటులో జాప్యం
- కురుస్తున్న భారీ వర్షాలు
- వ్యాపారుల్లో భయం... భయం
- గోదాములు, తయారీ కేంద్రాల్లో రక్షణ చర్యలు తీసుకునేనా...?

నెల్లూరు(క్రైం) అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా, చిన్నా పెద్దా తారతమ్యాలు లేకుండా జరుపుకునే పండుగ దీపావళి. ఇంటిళ్లపాది కలిసి సంతోషంగా జరుపుకోవాలని అందరూ కోరుకుంటారు. మరి ఈ ఏడాది దీపావళి జిల్లా ప్రజలందరిలోనూ కాంతులను నింపుతుందా..? లేక ప్రమాదాలను తీసుకువస్తుందా..? అనేది వేచిచూడాలి. జిల్లాలో పర్మినెంట్ లైసెన్సులు కలిగిన దుకాణాలు 32 ఉండగా, 320కిపైగా షాపులకు తాత్కాలిక లైసెన్సులు జారీ చేశారు. నగరంలోని ఆరు ప్రాంతాల్లో టపాసుల దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. దుకాణాలకు అనుమతులు ఇవ్వడం ఈ ఏడాది ఆలస్యం కావడం, భారీ వర్షాలు కురుస్తుండడంలో వ్యాపారులు భయందోళనలు వ్యక్తం చేస్తున్నారు.



నెల్లూరు : వీఆర్సీ మైదానంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

మరువలేని పొర్లుకట్ట ఘటన

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే టపాసుల తయారీకి అధికారులు అనుమతులు ఇచ్చారు. గతంలో అనుమతులు ఇవ్వమని తెలిపినా, బాణసంచా తయారు చేసుకునే వారి జీవనాధారాన్ని దృష్టిలో పెట్టుకుని పర్మిషన్లు రెన్యువల్ చేశారు. ఉమ్మడి జిల్లాలోని గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, ఆత్మకూరు, వింజమూరు,నగరంలోని పొర్లుకట్ట ప్రాంతాల్లో మాత్రమే టపాసుల తయారీకి అనుమతులు ఉన్నాయి. అవి కూడా పూర్తి జాగ్రత్తలు తీసుకుంటూ కేటాయించిన ప్రాంతాల్లోనే టపాసుల తయారీ చేయాల్సి ఉంది. తయారీ కేంద్రాల్లోనూ అనుమతి పొందిన ప్రకారం నల్లమందుతో మాత్రమే బాణసంచా తయారు చేయాల్సి ఉంది. అయితే నిబంధనలు ఏ మాత్రం పాటించకుండా అధిక మొత్తంలో నల్లమందును తయారీ కేంద్రాల్లో ఉంచి టపాసులు తయారు చేస్తున్నారు. గతంలో పొర్లుకట్ట ప్రాంతంలో జరిగిన ప్రమాదాన్ని జిల్లా ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేదు.

పొర్లుకట్ట ప్రాంతంలో టపాసులు తయారు చేస్తున్న సమయంలో జరిగిన ప్రమాదంలో పలువురు మృత్యువాత పడ్డారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృత్తం కాకుండా నిబంధనలకు కచ్చితంగా పాటించేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

అనుమతులకు మించి నిల్వలు

జిల్లావ్యాప్తంగా టపాసులు గోదాములు, తయారీ కేంద్రాలు 38 ఉన్నాయి. గోదాముల్లో అనుమతులు ఇచ్చిన ప్రకారమే సరుకు నిల్వ చేసుకోవాలి. 10 నుంచి 1500 కేజీల వరకు నిల్వ కోసం అధికారులు గోదాములకు, దుకాణాలకు అనుమతులు ఇచ్చారు. అయితే నిబంధనలను అతిక్రమిస్తూ వేలాది కేజీల సరుకును గోదాముల్లో వ్యాపారులు నిల్వ ఉంచి, అమ్మకాలు చేస్తున్నారు. వీటి వద్ద కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

తెలుగు గంగ ప్రాజెక్టు
స్పెషల్ కలెక్టర్‌గా మౌర్య



నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు తెలుగుగంగ ప్రాజెక్టు (ఎఫ్ఏసీ) స్పెషల్ కలెక్టర్‌గా మౌర్యను నియమి స్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. మౌర్య తిరుపతి జిల్లా జేసీగా పని చేస్తున్నారు.. తెలుగుగంగ ప్రాజెక్టుకు స్పెషల్ కలెక్టర్(ఎఫ్ఏసీ)గా కూడా వ్యవహరించనున్నారు.

కందుకూరులో
9 స్వచ్ఛాంధ్ర, జీఎస్టీ తగ్గింపుపై ర్యాలీలు

కోటంరెడ్డి, పట్టాభికి క్లాస్

- ప్రెస్‌మీట్లపై రాష్ట్ర అధ్యక్షుడి ఆగ్రహం
- ఇకపై ఇలా జరిగితే ఊరుకునేది లేదు..
- ఇద్దరు నేతలకు పల్లా శ్రీనివాసరావు హెచ్చరిక
- విలేకరులతో మాట్లాడాలంటే జిల్లా అధ్యక్షుడి అనుమతి తప్పనిసరి





నెల్లూరు, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పక్కదారి పడుతోందని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చేసిన ఆరోపణలపై టీడీపీ అధిష్ఠానం సీరియస్ అయ్యింది. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు శనివారం నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిని, సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని అమరావతికి పిలిపించి, జిల్లా పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ సమక్షంలో గట్టిగా హెచ్చరించారు. రేషన్ బియ్యం పక్కదారి పడుతోందని, టీడీపీ నాయకులే మాఫియా లీడర్లుగా వ్యవహరిస్తున్నారని కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి విలేకరుల సమావేశంలో తీవ్రంగా ధ్వజమెత్తారు. అంతేకాక సివిల్ సప్లయ్స్‌శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేరును కూడా ప్రస్తావించడంతో కూటమిలో దుమారం రేగిన విషయం తెలిసిందే. ఈ విషయంపై శనివారం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అమరావతిలో వారిద్దరిని సంజాయిషీ కోరారు. అసలు ప్రెస్‌మీట్ పెట్టడానికి మీకు ఎవరు అనుమతి ఇచ్చారు.. అని కోటంరెడ్డిని పల్లా ప్రశ్నించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో కూర్చుని ఇష్టం వచ్చినట్లుగా మీడియాతో మాట్లాడటానికి ఇంగితం లేదా... అని ఘాటుగా పల్లా విరుచుకుపడినట్లు సమాచారం. ఇకపై ప్రెస్‌మీట్ పెట్టాలంటే జిల్లా పార్టీ అధ్యక్షుడి అనుమతి తీసుకోవాలి... ఆయనకు కంటెంట్‌ను వివరించాలి.. అందుకు ఆయన అంగీకరిస్తే తప్ప ప్రెస్‌మీట్ పెట్టడానికి వీలులేదు.. అని కోటంరెడ్డి, పట్టాభిలను ఆదేశించారు. మీ ఇద్దరి వ్యక్తిగత కక్షలను పార్టీపై రుద్దాలని చూస్తే సహించేది లేదని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటన జరిగితే కఠినచర్యలు తీసుకుంటామని పల్లా వారిని హెచ్చరించి పంపినట్లు తెలిసింది.కూటమి నేతలను పదిలంగా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని పల్లా గుర్తు చేశారు.

సోమశిలకు 15,064 క్యూసెక్కుల ప్రవాహం

అనంతసాగరం అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం 15,064 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాంలో 73.837 టీఎం సీల నీరు నిల్వ ఉందని, పవర్ టెన్నల్ ద్వారా దిగువకు 2,600, గేట్ల ద్వారా 7,500, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 3,600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఇక, కండలేరు జలాశయం నీటి సామర్థ్యం 68టీఎంసీలు కాగా, ప్రస్తుత డ్యాం నీటిమట్టం 60టీఎంసీలకు చేరిందని ఏఈ అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 3060 క్యూసెక్కులు ఇన్ ఫ్లో ఉండగా, 3000 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉందని ఆయన తెలిపారు.

నిత్యావసర సరుకులపై
రూ.2 వేల వరకు ఆదా

- జీఎస్టీ వెసులుబాటుతో ప్రజలకు భారీ ఊరట
- ఆత్మకూరు అవగాహన ర్యాలీలో మంత్రి ఆనం

ఆత్మకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించిన జీఎస్టీ వెసులుబాటు వల్ల తగ్గిన ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలకు భారీ ఊరట లభించిందని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆత్మకూరులో జీఎస్టీ సంస్కరణ వల్ల కలిగిన ప్రయోజనాలను ప్రజలకు వివరించేందుకు చేపట్టిన భారీ ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన జీఎస్టీ 2.0తో అన్నీ వర్గాల ప్రజలకు మేలు చేకూరిందన్నారు. ప్రతీ కుటుంబానికి నెలకు సుమారు రూ.2వేల వరకు ఆదా అవుతందని వివరించారు. ప్రజలకు నిత్యం ఉపయోగపడే నిత్యావసర సరుకులు, బ్రష్‌లు, సబ్బులు, కొబ్బరినూనె తదితర సామగ్రిపై జీఎస్టీని 18 శాతానికి తగ్గించడంతో ధరలు బాగా తగ్గాయని పేర్కొన్నారు. డయాబెటిక్ మందులపై జీఎస్టీని పూర్తిగా తొలిగించినట్లు వివరించారు. రైతులకు ఉపయోగపడే ట్రాక్టర్లు, వాటి విడి భాగాలపై 18 శాతం ఉన్న జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించడంతోపాటు ఏసీలు, టీవీలు, ఫ్రిజ్‌లు తదితరాలపై జీఎస్టీ బాగా తగ్గించడంతో ప్రతీ ఒక్కరికి అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రధానంగా రవాణా రంగంలో జీఎస్టీ సంస్కరణలు మంచి ఫలితాలను ఇస్తున్నట్లు మంత్రి వివరించారు.దీంతో స్కూటర్లు, బైకులు, కార్ల ధరలు బాగా తగ్గినట్లు తెలిపారు. అనంతరం జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ చందర్ జీఎస్టీ ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ముందుగా ఆత్మకూరులోని ట్రాక్టర్, స్కూటర్ షోరూమ్‌లను మంత్రి ఆనం సందర్శించారు.



జీఎస్టీ అవగాహన ర్యాలీలో మంత్రి ఆనం, డీటీసీ చందర్, నాయకులు, అధికారులు

ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం

పేద, మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తూ, వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి ఆనం తెలిపారు. నియోజకవర్గంలోని 111 మంది బాధిత కుటుంబాల లబ్ధిదారులకు రూ. 88.50 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని 125 మంది కార్మికులకు రెండు జతల దుస్తులు, సామగ్రికిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బీ. పావని, మున్సిపల్ ఛైర్‌పర్సన్ జీ. వెంకటరమణమ్మ, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

శంభో... శివ శంభో!

భక్తిశ్రద్ధలతో శని మహా త్రయోదశి



నెల్లూరు : చిన్న నందివాహనంపై మూలస్థానేశ్వరుడు, భువనేశ్వరిదేవి ప్రాకారోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని శైవక్షేత్రాల్లో శనివారం శని మహాత్రయోదశి పూజలు జరిగాయి. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పాలభిషేకాలు నిర్వహించారు. శని మహాదేవుడికి తైలాభిషేకాలు పూజలు జరిగాయి. సాయంత్రం ప్రదోషకాల పూజలు చేశారు. నందీశ్వరునికి విశేష ద్రవ్యాలతో అభిషేకం, అలంకారాలు జరిగాయి. అనంతరం శివుడికి అభిషేకాలు, పాలభిషేకాలు, పంచామృతాభిషేకాలు జరిగాయి. నగరంలో ప్రదోషకాల పూజలు, మూలస్థానేశ్వరాలయం, నీలకంఠేశ్వరాలయం, రాజరాజేశ్వరి ఆలయం, నవాబుపేట మల్లికార్జునస్వామి ఆలయం, ఉస్మాన్ సాహెబ్‌పేట, భక్తవత్సలనగర్, పడారుపల్లి శివాలయాల్లో ఘనంగా జరిగాయి. భక్తుల శివనామ స్మరణలతో ఆలయాలు మారుమోగిపోయాయి.

ఘనంగా ధన త్రయోదశి

నగరంలోని బంగారు దుకాణాల్లో ధన త్రయోదశి పూజలు నిర్వహించారు. కార్పొరేట్ బంగారు దుకాణాలు, బంగారం, వెండి, డైమండ్స్ అమ్మకాలపై బంపర్ ఆఫర్లు ప్రకటించాయి. దీంతో బంగారం కొనుగోలుదారులతో కార్పొరేట్ బంగారు దుకాణాలు కళకళలాడాయి.

వైభవంగా చిన్నవెండి నందిసేవ

మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో శనివారం రాత్రి శని మహాత్రయోదశి, ప్రదోషకాల పూజలు సందర్భంగా చిన్న వెండినంది వాహనంపై మూలస్థానేశ్వర స్వామికి, భువనేశ్వరి అమ్మవారికి ఆలయ ప్రాకారోత్సవం జరిగింది. సాయంత్రం నందీశ్వరుడికి విశేష పూజలు, అభిషేకాలు, అలంకారం జరిగింది. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో ఆర్‌వీ శ్రీనివాసులురెడ్డి, అర్చక స్వాములు, సిబ్బంది పర్యవేక్షించారు.

జోరు వాన

- జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు
- నగరంలో రోడ్లన్నీ జలమయం



నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో శనివారం జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం పడింది. ఈ వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధానంగా నెల్లూరు నగరంలోని మూడు హాళ్ల సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, ఏకే నగర్ ప్రాంతాల్లో రోడ్లపై మురుగునీరు చేరింది. కాలువల్లో చెత్తాచెదారాలను తొలగించకపోవటంతో మురుగునీరు రోడ్లపై పారింది. ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించినప్పటి నుంచి జిల్లాలో మూడురోజులుగా వర్షం పడుతోంది. కురుస్తున్న వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం చల్లబడడంతో ప్రజలకు కొంత ఉపశమనం కలిగింది. కాగా జిల్లాలో సగటు వర్షపాతం 6.2 మి.మీగా నమోదైంది. అత్యధికంగా కొండాపురంలో 32.2 మి.మీ, అత్యల్పంగా కొడవలూరులో 2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

బోగోలులో ఎడతెరిపి లేకుండా...

బిట్రగుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. కొంతసేపు ఎండ.. అంతలోనే వర్షం కురుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల దెబ్బతిన్న డ్రైనేజీ కాలువల్లోని మురికినీరు రోడ్లపై ప్రవహిస్తు దుర్గంధం వెదజల్లుతోంది.

చెరువును తలపిస్తున్న పాఠశాల ఆవరణ

జలదంకి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీకే అగ్రహారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణ అంతా వర్షపునీటితో నిండి చెరువును తలపిస్తోంది. గత మూడు రోజులుగా మండలంలో వర్షం కురుస్తుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాల ఆవరణలో నీరు నిల్వ చేరకుండా చదును చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కావలి
కందుకూరు

కందుకూరులో స్వచ్ఛాంధ్ర ర్యాలీ



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి, సబ్ కలెక్టరు హిమవంశీ తదితరులు

కందుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని కందుకూరులో శనివారం భారీ సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. స్థానిక టీఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఆర్టీసీ డిపో వరకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టరు దామెర హిమవంశీ తదితరులు స్వయంగా సైకిళ్లు తొక్కుతూ ర్యాలీలో పాల్గొన్నారు. టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె అనూష, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వర రావు, చిలకపాటి మధుబాబు, నార్నె రోశయ్య, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, పోకూరి రాంబాబు, మంచిరాజు మురళి, చుండూరి మాల్యాద్రి, బీజేపీ నాయకులు గట్టమనేని హరిబాబు, పాల్గొన్నారు.

'ప్రకాశం'లో స్వయంచాలక వాహన భద్రతపై సెమినార్

కందుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థుల కోసం స్వయం చాలక వాహన భద్రతపై గ్యాస్‌ల ప్రభావం అనే అంశంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్‌శాఖ హెచ్‌ఓడీ డాక్టరు కె సుబ్బా రెడ్డి ఆధ్వర్యంలో కళాశాల పూర్వ విద్యార్థిని సంయుక్త ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలో తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టరు కె. విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ



వాహనదారులకు లక్కీడిప్ ద్వారా బహుమతులు అందజేస్తున్న ఆర్టీవో టీవీఎన్ లక్ష్మి

కందుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించటం కోసం కందుకూరు ఆర్టీఓ టీవీఎన్ లక్ష్మి ఆధ్వర్యంలో శనివారం మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోటారు సైకిళ్ల షోరూంలలో జీఎస్టీ ద్వారా లబ్ధిపొందిన వాహన దారులకు లక్కీడిప్ ద్వారా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఐ జె అనిల్‌కుమార్, జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ యానాదిపాల్గొన్నారు.

వర్షాలతో వరిపైరుకు నష్టం

కందుకూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కందుకూరు ప్రాంతంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని మాచవరంలో వరి పైరుకు నష్టం వాటిల్లింది. శనివారం మండల వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రహీం మాచవరం గ్రామాన్ని సందర్శించి వరిపైరును పరిశీలించారు. రమారమి 200 ఎకరాలలో వరిపైరుకు భారీవర్షాల కారణంగా నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఆయన తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ. 11,67,412

వలేటివారిపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామికి శనివారం భక్తుల నుండి రూ. 11,67,412 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.